CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 | సంచిక : 64 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 10 నవంబర్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda



## జూబ్లీహిల్స్‌లో ముగిసిన ప్రచారం

జూబ్లీహిల్స్ నియోజకవర్గం


- నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్
- బరిలో 58 మంది అభ్యర్థులు
- ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ
- నవంబరు 14న ఓట్ల లెక్కింపు

జూబ్లీహిల్స్ లో 17 రోజులుగా హెూరాహెూరీగా సాగిన బైపోల్? ప్రచారం నవంబర్ 9న సాయంత్రం 6 గంటలతో ముగిసింది. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ చివరిరోజు భారీ ర్యాలీలు, రోడ్ షోలతో ప్రచారాన్ని ముగించాయి. ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీల నాయకులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సాయంత్రం 5 గంటల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు జిల్లాల నుంచి వచ్చిన పార్టీల నాయకులందరూ తిరిగి వెళ్లిపోవాలని ఇప్పటికే సూచనలు చేశారు హైదరాబాద్ సిపి సజ్జనార్. నిబంధనలకు విరుద్ధంగా స్థానికేతరులు జూబ్లీహిల్స్ లో ఉంటే చాట్ట రీత్యా చర్యలు తీసుకోనున్నారు పోలీసులు. ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం ఓటర్లను ప్రలోభాల గురి చేస్తే కఠిన చర్యలు తీసుకున్నందుకు హైదరాబాద్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో భారీ బద్రతను ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి వచ్చే అన్ని మార్గాలలో పోలీస్ భద్రతను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు పోలీసులు .జూబ్లీహిల్స్ పరిధిలో వైన్స్, పబ్బులు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పెన్ పవర్:

### పోలింగ్ శాతం పెరిగేనా?

ఈఒక్కో పోలింగ్ కేంద్రంలో కనీసం 986 మంది ఓటర్లున్నారు. 1200 మంది ఓటర్లకు పైగా 11 పోలింగ్ కేంద్రాలుండగా అత్యల్పంగా 263 పోలింగ్ స్టేషన్‌లో 540 మంది ఓటర్లు.. అత్యధికంగా 9 వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో 1233 మంది ఓటర్లున్నారు. ఇక్కడ ప్రతి ఎన్నికల్లోనూ యాభై శాతానికి కొంచం అటు ఇటుగా పోలింగ్ నమోదవుతోంది. ఈ సారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.





వివరాలు 2లో..

## రాసిపెట్టుకోండి.. 2034 వరకూ మాదే అధికారం

- కేటీఆర్ జీవితంలో అధికారం అనే రేఖ లేదు... శ్రీలీల ఐటమ్ సాంగ్ గుర్తుకొస్తోంది
- అభివృద్ధి కోసం చంద్రబాబు, వైఎస్ విధానాలను ఫాలో అవుతున్నాం: రేవంత్ రెడ్డి



- హైదరాబాదులో మీట్ ది ప్రెస్ కార్యక్రమం
- జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానాలు
- కేటీఆర్ దశ బాగా లేదు... కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం లేదని ఎద్దేవా
- పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని విమర్శలు
- అభివృద్ధి కోసం చంద్రబాబు, వైఎస్ విధానాలను ఫాలో అవుతున్నాం: రేవంత్ రెడ్డి
- ఐటీ, ఫార్మా రంగాలను వారు ప్రోత్సహించారన్న ముఖ్యమంత్రి
- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు
- ఐటీ రంగానికి పునాది వేసిన నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలను వారు ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు."జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారింది. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పునాది వేసిన ఐటీ రంగం

వివరాలు 2లో..

## 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్...

### రూ.95 కోట్లు మోసం చేసిన 81 మంది అరెస్ట్



- ఏపీ సహా పలు రాష్ట్రాల్లో 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- దేశవ్యాప్తంగా 754 కేసుల్లో నిందితులుగా గుర్తింపు
- మొత్తం రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన ముఠా
- నిందితుల ఖాతాల్లోని కోట్లాది రూపాయలు ఫ్రీజ్
- డబ్బును బాధితులకు తిరిగి అందజేస్తామన్న పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశవ్యా ప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఆపరేషన్‌ను విజయవం తంగా పూర్తి చేసింది. ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి,

వివరాలు 2లో..





## బీహార్ లో ముగిసిన రెండో విడత ఎన్నికల ప్రచారం

- నవంబర్ 11న రెండో దశ పోలింగ్, 14న ఫలితాల వెల్లడి
- తొలి దశలో విపక్షాలకు గట్టి షాక్ తగిలిందన్న ప్రధాని మోదీ
- విపక్షాల 'జంగిల్ రాజ్' పాలనపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ సంచలన ఆరోపణలు
- రాహుల్ గాంధీ పర్యటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎద్దేవా

వివరాలు 2లో..

## జపాన్ లో భారీ భూకంపం... సునామీ హెచ్చరికలు జారీ

- జపాన్ ఈశాన్య తీరంలో 6.7 తీవ్రతతో భారీ భూకంపం
- ఇవాతె రాష్ట్రానికి సునామీ హెచ్చరికలు జారీ
- కొన్ని ప్రాంతాల్లో ఎగిసిన సునామీ అలలు
- తాత్కాలికంగా నిలిచిపోయిన బుల్లెట్ రైలు సర్వీసులు
- ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రధాని సూచన
- అణు విద్యుత్ కేంద్రానికి ఎలాంటి ప్రమాదం లేదని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్::**జపాన్‌లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దేశ ఈశాన్య ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ భూకంపం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, బుల్లెట్ రైలు సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. జపాన్ వాతావరణ సంస్థ (%జీఎంఏ%) వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:03 గంటలకు సంరికు తీరానికి సమీపంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కారణంగా

వివరాలు 2లో..


## ఉగ్రదాడికి భారీ కుట్ర భగ్నం.. హైదరాబాదీ అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలో ఉగ్రదాడులకు కుట్ర పన్నిన ముగ్గురిని గుజరాత్?పోలీసులు అరెస్ట్ చేశారు. దాడులు చేసేందుకు ఆయుధాలు సరఫరా చేస్తున్నారని, భారీ ఉగ్రకుట్రకు ప్రయత్నించిన హైదరాబాదీ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ తోపాటు

వివరాలు 2లో..

## ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు



- ఏ రాజకీయ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమన్న మోహన్ భగవత్
- రామ మందిరానికి కాంగ్రెస్ మద్దతిచ్చినా అండగా నిలిచేవాళ్లమని వెల్లడి
- కాషాయం మాకు గురువు లాంటిది, అందుకే ఆ జెండాను ఎగరేస్తాం అని వివరణ
- విమర్శలను పట్టించుకోం.. అవే మాకు మరింత ప్రచారం కల్పిస్తాయి అని వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్::**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన

వివరాలు 2లో..

## అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ..డ్రోన్లతో నిఘా




**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ బైపోల్ కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. జూబ్లీహిల్స్ లో 4 లక్షల ఒక వేయి 365 ఓటర్లు ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నారని..ఓటర్లు ముందుకు వచ్చి ఓటెయ్యాలని

వివరాలు 2లో..



## జంగిల్ సఫారీలో రాహుల్..

### 'లీడర్ ఆఫ్ పార్టీయింగ్' అంటూ బీజేపీ ఫైర్

- బీహార్ ఎన్నికల వేళ మధ్యప్రదేశ్‌లో రాహుల్ గాంధీ జంగిల్ సఫారీ
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల శిక్షణా శిబిరానికి హాజరైన రాహుల్
- బీజేపీ ప్రోద్బలంతో ఈసీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆరోపణ
- మోదీ, అమిత్ షా, సీఈసీ కలిసి ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారన్న రాహుల్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# లోకేష్ ఎంట్రీ: ఆ పాలిటిక్స్ సెట్ రైట్ అవుతాయా..?

మంత్రి నారా లోకేష్ తాజాగా అనంతపురం జిల్లాలో పర్యటించారు. శుక్రవారం రాత్రి ఆయన అనంతపురం జిల్లాకు వెళ్లారు. పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. వాస్తవానికి దీనికి పెద్దగా కారణం ఏమీ లేకపోయినా ఇటీవల జరుగుతున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో లోకేష్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. పైకి ఈ విషయం చెప్పలేదు కానీ అంతర్గతంగా ఉన్న విభేదాలను పరిష్కరించేలాగా మరీ ముఖ్యంగా సొంత పార్టీ నాయకులే రోడ్డు మీదకు వచ్చే వివాదాలకు కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో వారిని దారిలో పెట్టేలాగా మంత్రి నారా లోకేష్ పర్యటన చేశారన్నది పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ.గత కొన్నాళ్లుగా తాడిపత్రి నియోజకవర్గం నుంచి అనంతపురం అర్బన్ వరకు, కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గం వరకు, పుట్టపర్తి నుంచి రాప్తాడు నియోజకవర్గం వరకు పలు విభేదాలు, విమర్శలు తెరమీదకు వచ్చాయి. ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలకు మధ్య ఎంపీలు ఎమ్మెల్యేలకు మధ్య ఎమ్మెల్యేలు స్థానిక నాయకు లకు మధ్య కూడా విభేదాలు వివాదాలు రోడ్డున పడుతున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటు న్నారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు.ప్రధానంగా వైసీపీని టార్గెట్ చేయాలని చంద్రబాబు చెబుతుంటే వారిలో వారే విమర్శలు చేసుకోవడం వారిలో వారే విభేదాలు సృష్టించుకోవడం అన్నది కనిపిస్తుంది. ఈ పరిణామాల నేపథ్యంలో వాటిని కట్టడి చేసేందుకు నాయకులను దారిలో పెట్టాలన్న ఉద్దేశంతో నారా లోకేష్ అక్కడ పర్యటించారు. ఈ క్రమం లో ఆయన ఎవరినీ బలంగా విమర్శించకపోయినా ఒక కీలక లక్ష్యాన్ని మాత్రం నాయకులకు చేరవేశారు. అందరూ ఐక్యంగా ఉండాలని వచ్చే ఎన్నికల్లో కూడా విజయం దక్కించుకోవాలంటే అందరూ కలిసి నడవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.అంతేకాదు అంతర్గత విభేదాలు విమర్శలు చేసుకోవడం వల్ల పార్టీ బలహీనపడుతుందని అలాంటి సమయంలో పార్టీ ఉపేక్షించదని.. ఎంతటి పెద్ద నాయకులైనా పక్కన పెట్టడం ఖాయమని ఆయన పరోక్షంగా చెప్పుకొచ్చారు. దీనిని ఒకరికి ఆపాదిస్తూ చెప్పకపోయినా అంతర్గతంగా ఉన్న లక్ష్యం మాత్రం ప్రతి ఒక్కళ్ళని హెచ్చరించడమే అన్నది వాస్తవం. దీనిని అర్థం చేసుకొని నాయకులు గాడిలో పడితే అనంతపురం పాలిటిక్స్ లైన్ లోకి వస్తాయి అన్నది పార్టీ అధిష్టానం ఆలోచన.ఈ నేపథ్యంలోనే మంత్రి నారా లోకేష్ అందరిని ఒకే వేదికపై కూర్చోబెట్టి నేరుగా పేరు పెట్టి ఎవరిని విమర్శించక పోయినా పార్టీ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని గతంలో అనంతపురం జిల్లా టిడిపికి ఏ విధంగా మేలు చేసిందన్న విషయాలను కూడా ఆయన ప్రస్తావించారు. తద్వారా కలిసి ఉంటేనే ఏదైనా సాధించగలుగుతామని చెప్పుకొచ్చారు. ఒకవేళ ఎవరైనా అంతర్గత విభేదాలు పెట్టుకొని రచ్చ చేసుకుంటే అది వారికే నష్టం వస్తుందని కూడా తేల్చి చెప్పారు. తద్వారా పార్టీలో ఐకమత్యానికి పెద్దపేట వేస్తున్నామనే సంకేతాలను స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. మరి దీనిని సీనియర్ నాయకులు అర్థం చేసుకుంటారా లేక ఇలాగే విభేదాలతో కొనసాగుతారా అనేది చూడాలి.

# బీహార్ లో ముగిసిన రెండో విడత ఎన్నికల ప్రచారం

దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. అధికార, విపక్షాల మధ్య మాటల తూటాలు పేలిన సుదీర్ఘ ప్రచారానికి శనివారంతో ముగింపు పలికారు. ఇప్పటికే నవంబర్ 6న జరిగిన తొలి దశ పోలింగ్‌లో రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో 65.08 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక నవంబర్ 11న 122 స్థానాలకు రెండో దశ పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. తొలి విడతలో 121 స్థానాలకు పోలింగ్ జరిగింది. రెండో విడత ప్రచారానికి చివరి రోజైన ఆదివారం రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విపక్షాల 'జంగిల్ రాజ్' పాలనను గుర్తుచేస్తూ, దేశంలోకి చొరబాటుదారులను ఏరివేస్తామని హామీ ఇచ్చారు. తొలి దశ పోలింగ్‌లోనే ప్రజలు విపక్ష 'ఇండియా' కూటమికి 65 వోల్టుల షాక్ ఇచ్చారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి తాను మళ్లీ వస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఎన్డీఏ కూటమి విజయంపై చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొట్టిపారేశారు. వారి వాదనల్లో ఎలాంటి పస లేదని తెలిపారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత పవన్ ఖేరా, ఓటర్ల జాబితాలో అవకతవకలకు ఎన్నికల కమిషన్ సహకరిస్తోందంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఇది రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇక, బిహార్‌లో ప్రచారం ముగిసిన మరుసటి రోజే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో పర్యటించడం విమర్శలకు దారితీసింది. బిహార్ ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ విషయంపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ 'పిక్నిక్'లో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. కీలకమైన సమయంలో బిహార్‌కు దూరంగా ఉండటమంటే విపక్షాలు ఓటమిని అంగీకరించినట్లేనని ఆయన విమర్శించారు.

# జూబ్లీహిల్స్ లో ముగిసిన ప్రచారం

- మొదటి పేజి తరువాయి

స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది . అక్టోబర్ 13న నోటిఫికేషన్? విడుదలైంది. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత ,బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేస్తున్నారు. నవంబర్ 11న పోలింగ్ జరుగనుండగా.. 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. దాదాపు 4 లక్షల మంది ఓటర్లున్న ఈ హై-ప్రొఫైల్ నియోజకవర్గంలో గెలుపు ప్రతిష్టాత్మకంగా మారడంతో అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ లీడర్లు జోరుగా ప్రచారం చేశారు . ఇప్పుడు ప్రచార గడువు ముగియడంతో చివరి అస్త్రంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై నాయకులు ఫోకస్ పెట్టారు.

**స్కీమ్‌లతో జనంలోకి కాంగ్రెస్**

జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో ఇప్పటికే ఇంటింటి ప్రచారం పూర్తిచేసిన కాంగ్రెస్.. చివరిరోజైన ఆదివారం కూడా ప్రతి గడపకూ వెళ్లింది. ఇందుకోసం మంత్రుల ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి.. రెండేండ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ ఉప ఎన్నికలో గెలవడం ద్వారా ప్రతిపక్షాల విమర్శలకు చెక్?పెట్టడంతో పాటు కాంగ్రెస్‌చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా చేపట్టిన భారీ ప్రాజెక్టులను నిరభ్యంతరంగా ముందుకు తీసుకెళ్లవచ్చనే ఆలోచనలో అధికారపార్టీ ఉంది.

సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రచారంలోకి దిగి.. వరుసగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. మంత్రులు కూడా ప్రచారంలో భాగస్వాములయ్యారు. వారిలో 13 మందికి నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్ బాధ్యతలు అప్పగించగా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన మహాలక్ష్మి, గృహలక్ష్మి వంటి ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. కాంగ్రెస్? ప్రధానంగా మహిళలు, మైనారిటీలు, బీసీలు, యువత ఓట్లపై ఆశలు పెట్టుకుంది. బీసీ నాయకుడైన నవీన్ యాదవ్‌ను గెలిపించుకోవడం ద్వారా బీసీ సాధికారతపై తమకున్న చిత్తశుద్ధిని చాటుకోవాలని అధికారపార్టీ భావిస్తున్నది.

# రాసిపెట్టుకోండి.. 2034 వరకూ మాదే అధికారం

- మొదటి పేజి తరువాయి

నగర అభివృద్ధికి కీలకంగా మారింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకంగా మారాయి. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశాయి. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు నగరంలో ఏర్పాటయ్యాయి. దేశానికి వచ్చిన వాటిలో 70 శాతం ఇక్కడికే వచ్చాయి. ప్రపంచాన్నే శాసించే సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. నగరం నాలెడ్జ్ సిటీగా మారిందంటే అందుకు గతంలో కాంగ్రెస్ సీఎంలు తీసుకున్న నిర్ణయాలే కారణం. అభివృద్ధి మాత్రమే కాదు.. సంక్షేమంలోనూ వారు తమదైన ముద్ర వేశారు. 2004-2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉంటూ హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశాయి.

**అన్ని రంగాల్లోనూ కేసీఆర్ ప్రభుత్వం విఫలం..**

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో త్యాగాలు చేసింది. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి 4 కోట్ల మంది ప్రజలకు ఇచ్చింది. భారత రాష్ట్ర సమితి హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. వ్యవసాయం, విద్య, వైద్యం.. ఇలా అన్ని రంగాల్లోనూ విఫలమయ్యారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా? కాళేశ్వరం లేకుండానే మా ప్రభుత్వం అత్యధికంగా వరి పంటను ఉత్పత్తి చేసింది. గత పాలకులు ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులన్నీ పెండింగులోనే పెట్టారు. ఎలాంటి ప్రయోజనం లేని కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతిభవన్, సచివాలయం మాత్రమే కేసీఆర్ పూర్తిచేశారు.

**కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతివ్వలేదు**

కేటీఆర్ జీవితంలోనే అధికారం అనే రేఖ లేదు. కుమారుడి విషయంలో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారు. కేటీఆర్ దశే బాగాలేకపోతే కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ఏం లాభం? కేటీఆర్ ఎన్నికల ప్రచారం పుష్ప సినిమాలో శ్రీలీల ఐటమ్‌సాంగ్‌ను గుర్తుకు తెస్తోంది. 3 నెలలు అవుతున్నా కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్ని కూడా నేను రద్దు చేయలేదు. వాటిని కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్తపథకాలు తీసుకొచ్చాను. ఎస్సీ వర్గీకరణపై ఎవరూ చేయని సాహసం చేశాను. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపాను. దేశంలో ఎవరూ చేయని కులగణనను రాష్ట్రంలో చేసి చూపించాను. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించాను. మహిళలకు ఉచిత ప్రయాణం సహా అనేక ఎన్నికల హామీలు నెరవేర్చాను.

**భాజపాకు డిపాజిట్ వస్తే దేశం మొత్తం గెలిచినట్లే**

రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు గుజరాత్ తరలి వెళ్లేందుకు భాజపా నేతలు కృషి చేస్తున్నారు. సెమీ కండక్టర్ల కంపెనీ ఆ రాష్ట్రానికి తరలించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి యత్నిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపాది ఫెవికాల్ బంధం. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాం. ఇప్పటి వరకు విచారణ ఎందుకు ప్రారంభించలేదు? జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డిపాజిట్ తెచ్చుకుంటే భాజపా దేశం మొత్తం గెలిచినట్లే. మరో 8 ఏళ్లు మేమే అధికారంలో ఉంటాం. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి. నేను చెప్పేది రాసి పెట్టుకోండి.. 2034 జూన్ వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుంది"అని రేవంత్ అన్నారు.

# జంగిల్ సఫారీలో రాహుల్..

## 'లీడర్ ఆఫ్ పార్టీయింగ్' అంటూ బీజేపీ ఫైర్

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్‌లో జంగిల్ సఫారీకి వెళ్లడం రాజకీయంగా దుమారం రేపింది. ఈ పరిణామంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా విమర్శలు గుప్పించింది. రాహుల్ గాంధీకి 'ఎల్‌వోపీ' అంటే 'లీడర్ ఆఫ్ పార్టీయింగ్' అని ఎద్దేవా చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "రాహుల్ గాంధీకి ఎల్‌వోపీ అంటే పర్యటనలు, పార్టీల నాయకుడు. బీహార్‌లో ఎన్నికలు జరుగుతుంటే ఆయన విహారయాత్రకు వెళ్లారు. ఎన్నికల్లో ఓడిపోయాక ఈవీఎంలు, ఎన్నికల సంఘాన్ని నిందిస్తారు" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోకుండా, తన ముఖానికి ఉన్న దుమ్మును వదిలి అద్దాన్ని తుడుస్తోందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ శనివారం నర్మదాపురం జిల్లాలోని పచ్‌మర్హికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం 6:15 గంటలకు ఓపెన్ జీపులో జంగిల్ సఫారీకి బయలుదేరి, పనార్‌పాని గేట్ వరకు సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణించారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన బీహార్‌లోని కిషన్‌గంజ్‌లో జరిగే ఎన్నికల ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్లనున్నారు.

**ఈసీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు**

మధ్యప్రదేశ్ పర్యటన సందర్భంగా రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ ప్రోద్బలంతో ఎన్నికల సంఘం 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని విమర్శించారు. "కొన్ని రోజుల క్రితం హరియాణాపై నేను ప్రజెంటేషన్ ఇచ్చాను. అక్కడ 25 లక్షల ఓట్లు, అంటే ప్రతి 8 ఓట్లలో ఒకటి దొంగిలించబడింది. అదే తరహాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో కూడా జరిగిందని నేను నమ్ముతున్నాను" అని ఆయన అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ 'జాయింట్ పార్ట్‌నర్‌షిప్'గా

ఏర్పడి ప్రజాస్వామ్యంపై, అంబేద్కర్ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. "మోదీజీ, అమిత్ షాజీ, జ్ఞానేష్ జీ కలిసి చేస్తున్న ఈ పని వల్ల దేశం తీవ్రంగా నష్టపోతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

# 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్...

- మొదటి పేజి తరువాయి

రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన 81 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరిపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.తెలంగాణ పోలీసుల కథనం ప్రకారం, సైబర్ నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో... ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 81 మందిని అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు. నిందితుల నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల

నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అరెస్టులతో దేశంలోని అనేక సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడినట్లయిందని అధికారులు తెలిపారు.

# జపాన్ లో భారీ భూకంపం... సునామీ హెచ్చరికలు జారీ

- మొదటి పేజి తరువాయి

ఇవాతె రాష్ట్ర తీరాన్నిమీటరు ఎత్తు వరకు సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఒఫునాటోలో 10 సెంటీమీటర్ల ఎత్తున, మియాకోలో ఓ మోస్తరు అలలు తీరాన్ని తాకినట్లు అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన తొహోకు షింకన్‌సెన్ బుల్లెట్ రైలు సర్వీసులను కొద్దిసేపటికే పునరుద్ధరించినట్లు ఆపరేటర్ జేఆర్ ఈస్ట్ ప్రకటించింది.ఈ ఘటనపై జపాన్ ప్రధాని సనాయె తకైచి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సునామీ హెచ్చరిక జారీ చేయబడింది, కాబట్టి దయచేసి వెంటనే తీరం నుంచి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి. ఊహించిన దాని కంటే పెద్ద సునామీ రావచ్చు, కాబట్టి తదుపరి సమాచారం కోసం అప్రమత్తంగా ఉండండి. భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంది" అని ఆమె ప్రజలను హెచ్చరించారు.మియాగి రాష్ట్రంలోని ఒనగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి నష్టం నమోదు కాలేదని, ప్లాంట్‌కు ఎటువంటి ప్రమాదం లేదని తొహోకు ఎలక్ట్రిక్ పవర్ సంస్థ స్పష్టం చేసింది. అయితే, రానున్న కొద్ది రోజుల్లో ఇదే తీవ్రతతో లేదా అంతకంటే శక్తివంతమైన భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని, సునామీ హెచ్చరికలున్న ప్రాంతాల్లో ప్రజలు సముద్ర తీరానికి వెళ్లవద్దని వాతావరణ సంస్థ అధికారి ఒకరు మీడియా సమావేశంలో సూచించారు.

## ఉగ్రదాడికి భారీ కుట్ర భగ్నం..

# హైదరాబాదీ అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

మరో ఇద్దరిని గుజరాత్ ATS పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సయ్యద్ మొహియుద్దీన్ ఫ్రాన్స్ లో MBBS చదివినట్లుగా పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అనంతరం హైదరాబాద్ లోని సయ్యద్ ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ ISKP సభ్యులతో టెలిగ్రామ్ ద్వారా సంబంధాలున్న ట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది. అతని వద్ద 2గ్లాక్ పిస్టల్స్, 1 బెరట్టా పిస్టల్, 30 లైవ్ క్యాట్రిడ్జ్ లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అనంతరం కోర్టులో హాజరు పర్చగా మొహియుద్దీన్ ను నవంబర్ 18 వరకు రిమాండ్ విధించింది.

# అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ..డ్రోన్లతో నిఘా

- మొదటి పేజి తరువాయి

పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ స్టేషన్లలో 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. పోలింగ్ ను డ్రోన్ల ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. ఈ సారి 4 బ్యాలెట్ యూనిట్లు వాడుతున్నామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల దగ్గర సీసీ కెమెరాలు అమర్చామని తెలిపారు. 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారని తెలిపారు. 561 కంట్రోల్ యూనిట్లు, 595 వీవీ ప్యాట్స్, 2,394 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోలింగ్ స్టేషన్స్ నుంచి వెబ్ కాస్టింగ్ లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్స్ దగ్గర హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

పోలింగ్ స్టేషన్ల దగ్గర పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగర జాయింట్ సీపీ ఇక్బాల్. నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎలక్షన్ కమిషన్ రూల్స్ ప్రకారం బందోబస్తు ఇస్తున్నామని చెప్పారు. సీఐఎస్ఎఫ్ నుంచి 8 కంపెనీల బలగాలు వచ్చాయన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటు పండుగలో పాల్గొనాలని సూచించారు. జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారం సందర్భంగా మొత్తం 27 రకాల కేసులు నమోదయ్యాయని చెప్పారు .బుక్కైన 27 కేసులను దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 3 కోట్ల 60 లక్షల నగదు పట్టుకున్నామని చెప్పారు.

# ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు

- మొదటి పేజి తరువాయి

ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఓ ప్రశ్నకు భగవత్ బదులిస్తూ, "మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి" అని వివరించారు. దేశానికి మేలు చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు. "ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు" అని ఆయన తేల్చిచెప్పారు."మాకు ఏ పార్టీ సొంతం కాదు, అలాగని ఏ పార్టీ పరాయిదీ కాదు. ఎందుకంటే అవన్నీ భారతీయ పార్టీలే. మేము 'రాష్ట్ర నీతి'కి మద్దతిస్తాం, 'రాజనీతి'కి కాదు. ఈ దేశం ఏ దిశలో పయనించాలనే దానిపై మాకు ఒక దార్శనికత ఉంది. ఆ దిశగా ఎవరు పనిచేసినా వారికి మా మద్దతు ఉంటుంది" అని భగవత్ పేర్కొన్నారు.

**జెండా వివాదంపై స్పష్టత**

జాతీయ జెండాకు బదులుగా ఆర్ఎస్ఎస్ ఎందుకు కాషాయ జెండా (భగవా ధ్వజ్)ను ఉపయోగిస్తుందన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. "సంఘ్ 1925లో ప్రారంభమైంది. మాకు ఒక గురువు అవసరం. కానీ వ్యక్తిని గురువుగా స్వీకరిస్తే, వారికి పరిమిత ఆయుష్షు ఉంటుంది. అందుకే శాశ్వతంగా ఉండే మన సంస్కృతికి, హిందూత్వానికి ప్రతీకగా కాషాయ జెండాను గురువుగా స్వీకరించాం" అని తెలిపారు. జాతీయ జెండాను 1937లో ఖరారు చేశారని, దాని రూపకల్పన జరిగినప్పటి నుంచి తాము త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తూనే ఉన్నామని అన్నారు. "ప్రైవేట్ సంస్థలు జాతీయ జెండాను ఎగురవేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, జనవరి 26, ఆగస్టు 15న అన్ని శాఖలలో జెండా వందనం చేస్తున్నాం. కమ్యూనిస్ట్ పార్టీకి ఎర్ర జెండా, కాంగ్రెస్‌కు వారి జెండా ఉన్నట్లే, మాకు కాషాయ జెండా ఉంది. ఇందులో వివాదం ఏమీ లేదు" అని స్పష్టం చేశారు.

మీడియా విమర్శలపై స్పందిస్తూ, "ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొందరి పని సంఘ్ గురించి సందేహాలు రేకెత్తించడమే. వారి విమర్శల వల్లే మాకు మరింత ఆదరణ పెరుగుతోంది. నిజం తెలిసినా కొందరు విమర్శిస్తూనే ఉంటారు. మేము వాటిని పట్టించుకోకుండా దేశం కోసం మా పని మేము చేసుకుంటూ పోతాం" అని మోహన్ భగవత్ అన్నారు.

# మా ఐదు ఎస్సీ కాలనీల కు సిసి రోడ్లు మంజూరు చేయండి మహాప్రభో...





ఎటపాక,పెన్ పవర్ ,నవంబర్ 9:అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ ఎస్సీ కాలనీలకు సీసీ రోడ్లు లేక నరకయాతన పడుతున్న విషయం రాజకీయ నాయకులకు తెలిసినదే... గత కొన్ని దశాబ్దాలు గడుస్తున్న నెల్లిపాక గ్రామ ఎస్సీ కాలనీలకు ఎటువంటి అభివృద్ధి లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకమార్లు ఓట్ల సమయంలో కాలనీలను సందర్శించిన తరుణంలో ఆ కాలనీలలో సీసీ రోడ్లు లేవు అనే విషయాన్ని ఎరిగి మా ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే మీ కాలనీలకు సిసి రోడ్లను డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి వెళ్లడమే గాని సిసి రోడ్లు డ్రైనేజీలు పోసిన దాఖలాలు లేవు,ఆంధ్ర తెలంగాణ విడిపోయిన నాటి నుండి నేటి వరకు ఎమ్మెల్యేలు మంత్రులు మారుతున్నారే గాని వారు ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చలేదు, గతంలో కొంతమంది ఎమ్మెల్యేలు నెల్లిపాక ఎస్సీ కాలనీ లలో సిసి రోడ్లు పూపిస్తామని శంకుస్థాపనలు చేసి ఆ తర్వాత సిసి రోడ్లు పోపించకుండా వదిలేశారు, ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లోకల్ నాయకులు మీ కాలనీలకు సిసి రోడ్లను మంజూరు చేపించి నిర్మాణాలు చేపడతామని ప్రకాల్బాలు పలికారే తప్ప కాలనీవాసులకు హామీలు ఇయటమే తప్ప ఆ హామీలను లోకల్ నాయకులు కూడా నెరవేర్చలేదు, నెల్లిపాక గ్రామంలో అనేక కాలనీలు ఉన్నాయి కానీ మా ఎస్సీ కాలనీకి మాత్రం సీసీ రోడ్లు గాని డ్రైనేజీలు గాని లేకపోవడంతో వర్షాకాల సమయంలో చిన్న వర్షం పడితే మోకాళ్ళ లోతు బురదతో నడవలేక నరకయాతన పడుతున్నామని, లోకల్ నాయకులకు మా గోడు వెళ్ళబుచుకున్న పని జరగడం లేదు, ఇకనైనా గ్రామపంచాయతీ అధికారులు మా కాలనీలా పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మా కాలనీలకు సీసీ రోడ్లను మంజూరు చేసి పుణ్యం కట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు,మన రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో ప్రతి గ్రామంలో సిసి రోడ్లను రోడ్లను మంజూరు చేసి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు తెలియజేసిన విషయం విధితమే... గ్రామపంచాయతీ నిధుల నుంచి మా ఎస్సీ కాలనీలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే విధంగా అధికారులు చొరవ తీసుకొని రోడ్లు మంజూరు చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం...

# ఘనంగా ప్రపంచవ్యాప్త అఖండ సాయి నామ సంకీర్తన.



కిర్లంపూడి,పెన్ పవర్, నవంబర్ 9:పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయింతి ఉత్సవాలను పురస్కరించుకొని
ప్రపంచవ్యాప్తంగా 24 గంటల పాటు జరిగే అఖండ సాయి నామ సంకీర్తనలో భాగంగా కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అఖండ సంకీర్తన కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. శ్రీ సత్య సాయి రాష్ట్ర సమితి పిలుపు మేరకు గత కొంతకాలంగా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కిర్లంపూడి శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవ చేయడమే పరమావధిగా భావించిన శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.అదే బాటలో కిర్లంపూడి సేవా సమితి సభ్యులు మెడికల్ క్యాంపులు,అన్నదాన కార్యక్రమాలు సమాజంలో జరిగే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో తమదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత కొన్ని సంవత్సరములుగా కిర్లంపూడి పరిసర గ్రామాలలో ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొని ప్రజల మన్ననలు పొందారు. భగవాన్ శ్రీ సత్యసాయి ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సేవా సమితి సభ్యులు తెలిపారు.

# జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన పథకానికి విరాళం



అత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 9: మండలంలోని ర్యాలి గ్రామంలో వేంచేసియున్న అతి పురాతన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంను దర్శించడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం ఆలయ సన్నిధిలో విశిష్ట పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.ఆలయంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కానూరు గ్రామానికి చెందిన కె. జగన్మోహనరావు%-%శ్రీలక్ష్మి దంపతులు ?10,116 రూపాయలను విరాళంగా సమర్పించారు.వీరిని ఆలయ వేదపండితులు అవధాని వేదాశీర్వచనం చేయగా, ఆలయ కార్యనిర్వహణ అధికారి వి. వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటం, చరిత్ర కలిగిన పుస్తకం, శేషవస్త్రం బహుకరించి సత్కరించారు.

# 14 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 9: స్థానిక రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 14 కుటుంబాలకు రూ.7.11 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆదివారం కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట మండలంలోని ఐదు కుటుంబాలకు, గండేపల్లి మండలంలోని నాలుగు కుటుంబాలకు, గోకవరం మండలంలోని నాలుగు కుటుంబాలకు, కిర్లంపూడి మండలంలోని ఒక్క కుటుంబానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. వివిధ రకాల అనారోగ్యాలతో బాధపడుతూ, ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నిజమైన వరంగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పార్టీలకతీతంగా అందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించేందుకు పనిచేస్తూ ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు తీసుకువస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జీను మణి బాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, బాదంపూడి ప్రకాష్, గల్లా శ్రీను, ముసిరెడ్డి శ్రీనివాస్, చింతల రామకృష్ణ, కందుల జమీలు, చిట్యాల బాబ్జి, చిట్యాల అప్పారావు, గుడివాడ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని దర్శించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు







అత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 9: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.
స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలయ ప్రాంగణానికి చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, జనసేన నాయకులు బండారు సత్యానందరావు, తనయులు బండారు సంజీవ్, అలాగే ఎం.ఆర్.ఓ, పోలీసు అధికారులు, పంచాయతీ అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.
స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలయ పరిసరాలను పరిశీలించి ఆలయ అభివృద్ధిపై ఆసక్తి చూపారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి స్పీకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు (బాబు) కాయల జగన్నాథరావు, టిడిపి నాయకులు జనసేన బిజెపి నాయకులు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు

# విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనసమరాధన





కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్ 9:కాకినాడ జిల్లా మండల కేంద్రమైన
కిర్లంపూడి దొర గారి కోటలో ఆదివారం విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో , అధ్యక్షుడు గానుగుల శ్రీనివాస్, కిర్లంపూడి మండల కార్యదర్శి కొత్తల ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వన సమరథనా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని విశ్వబ్రాహ్మణులు అంతా ఈ వన సమారాధనలో పాల్గొన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటపాటలతో వారంతా ఉత్సాహంగా గడిపారు. కూచిపూడి నాట్యం ప్రదర్శన, వైజాగ్ దర్పణ నాట్య అకాడమీ వారిచే జరిపిన కార్యక్రమం చూపర్లను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే కొత్తపేట వారిచే కోలాటం, మల్లేపల్లి వారిచే బుట్ట బొమ్మలు,కామాక్షి జూలర్స్ కొత్తల బ్రదర్స్ ఆధ్వర్యంలో చేపట్టారు . ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొత్తల వీర ప్రసాద్, లక్కోజ్ శివరామకృష్ణ, కొత్తల శ్రీను, చలపాక శివప్రసాద్, అత్తిలి వీరబ్రహ్మం, సత్యనారాయణ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు, పాల్గొన్నారు. నాట్య కళాకారులకు శాలువా కప్పి మెమొంటోఇచ్చి ఘనంగా సన్మానం చేశారు. .

# అక్రమంగా బొండు మట్టి తవ్వకాలు మూడు ట్రాక్టర్లను సీజ్



సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 9: సీతానగరం మండలంలోని సీతానగరం కైలాసగిరి ర్యాంపు ప్రాంతంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.
అక్రమంగా కొందరు అధికార పార్టీ నేతల అండదండలతో అడ్డదారిలో సొమ్ము చేసుకునేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా
బొండు మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎట్టకేలకు రెవెన్యూ పోలీస్ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కుతరలించారు.

# జాబ్ మేళా లో 239 మంది నిరుద్యోగుల కు నియమక పత్రాలు అందచేత

మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. కనకరాజు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 9:**ప్రతి మహిళను వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. కనకరాజు తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సుబ్రమణ్య మైదానంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జాబ్ మేళా లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభించారని చెప్పారు. మహిళా సాధికారతే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రుణాల మంజూరు, చేతి వృత్తులకు మద్దతు వంటి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

ఈ ఉద్యోగ మేళాలో రిటైల్, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ , ఫైనాన్స్, హాస్పిటాలిటీ, మాన్యుఫాక్చరింగ్, ఎడ్యుకేషన్ రంగాలకు చెందిన 18 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ మేళా నిరుద్యోగ యువతకు, మహిళాలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి మంచి వేదికగా నిలిచిందన్నారు. ఈ జాబ్ మేళా లో మొత్తం 2165 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా 645 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూ లకు హాజరైవారన్నారు. 239 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు తెలిపారు.డ్వాక్రా మహిళలు ,యువత అవకాశాలను వినియోగించుకుని, తమ జీవనోపాధిని అభివృద్ధి చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులు సూచించారు. అనుగుణంగా నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందనీ తెలిపారు. ఈ జాబ్ మేళా లో ఆపరేషన్ మేనేజర్ ఎన్.కార్తీక్, పెద్ద ఎత్తున యువత, మహిళలు, పలు కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.

# ఉత్సాహంగా వెలమ కార్తీక వన సమారాధన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 9:**

వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం నామవరంలోని గొర్రెల వీర సూర్య అప్పారావు తోటలో ఆదివారం వెలమ సంఘీయుల కార్తీక వన సమారాధనఉత్సాహంగా జరిగింది.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా వెలమ సంఘీయులు ఈ కార్తీక వన సమారాధనకు హాజరయ్యారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, చల్లా శంకరరావు తదితర వెలమ సంఘీయులతో కలిసి తులసి మొక్కకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సంఘ నాయకులు పెద్దఎత్తున పాల్గొని ఆధ్యాత్మికత, సాంప్రదాయ విలువలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. లక్ష్మీదేవి స్వరూపంగా భావించే ఉసిరిచెట్టు వద్ద పూజలు, సహపంక్తి భోజనాలు, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరూ చాలా ఉల్లాసంగా గడిపారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆట పాటల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

# వసతి గృహ విద్యార్థులకు అవగాహన





**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 9**: జగ్గంపేట శివాలయం వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహం, నెహ్రూ కాలనీలోని బాలికల వసతి గృహంలో విద్యార్థులకు ఆదివారం జగ్గంపేట సీఐ వైఆర్ కే శ్రీనివాస్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. పాఠశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు జాగ్రత్తగా చూసుకుంటూ రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఒకరి వెనుక మరొకరు వెళ్లాలని సూచించారు. లవ్ ట్రాప్స్ లో పడి బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న మోసాలు గురించి వివరించారు. భద్రత, రక్షణ సమస్యలు ఉంటే వెంటనే పోలీస్ దృష్టికి తీసుకురావాలని 100 లేదా 9440796529 నెంబర్ కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలుర హాస్టల్ వార్డెన్ పి.ప్రభాకర్, బాలికల హాస్టల్ వార్డెన్ పి. రోజా, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.


# 19వ డివిజన్ లో ఉచిత వైద్య శిబిరం లో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 9:**పేదలకు అందుబాటులో వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వార్డుల వారిగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్థానిక 19వ డివిజన్ రైల్వే స్టేషన్ వద్ద మున్సిపల్ కళ్యాణ మండపంలో సఖి సురక్ష కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు స్క్రీన్ టెస్ట్ లు అవసరమైన వారికి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ వైద్యం అంధక ఎవరూ ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. అవసరమైన వారికి వైద్యం అందించనున్నట్లు పేర్కొన్నారు . ఈ 15 నెలల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రెండు కోట్ల రూపాయలు నిధులు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి చర్యలు చేపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో శీలం గోవింద్, నిమ్మలపూడి గోవింద్, రొంపిచర్ల ఆంటోనీ, కొప్పిశెట్టి చిన్ని, కక్కల రమేష్, చిట్టిబోయిన శ్రీనివాస్, ఏడాకుల వెంకటేశ్వ రరావు, కుంచె హనుమం తరావు, నరసింహమూర్తి, చలమూరి సత్యనారాయణ, సింగవరపు సత్యనారాయణ, కేత అప్పారావు, పాలిక వెంకటరమణ, వాసు, కుసుమ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెలిచేరు గ్రామంలో వైభవంగా వన సమారాధన




**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 9 :**ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో కార్తీక మాస కాపు వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట నియోజకవర్గ యువ నాయకుడు బండారు సంజీవ్, కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ తో కలిసి హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన సమారాధనలో భక్తి గీతాలు, పూజా కార్యక్రమాలు, సత్సంగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# కోటిలింగాలపేట మత్స్యకారుల కు వరద నష్టపరిహారం అందజేత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్,9**

గోదావరి గట్టున కోటిలింగాల పేట, గట్టు పై నివాసం ఉంటున్న మత్స్యకారులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పేర్కొన్నారు. గోదావరి వరదలు, తుపాన్ ల్లో గోదావరి లంకల్లో నివాసం ఉండే మత్స్యకారులను గోదావరి ఒడ్డుకు చేర్చి , పునరావాసం కల్పించి భోజన సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ చర్యల్లో భాగమన్నారు. గోదావరి గట్టున, కోటిలింగాల పేటలో నివాసం ఉంటున్న మత్స్యకారులు మాత్రం వేటకు వెళ్లని సమయంలో ప్రభుత్వం తరపున తమకు సహకారం అందడం లేదని, ఏళ్ల తరబడి తాము ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్టు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వారి సమస్య పై రెవెన్యూ, ఫిషరీస్ శాఖల అధికారులతో మాట్లాడి కోటిలింగాలపేట మత్స్యకారుల సమస్యను పరిష్కరిం చామని పేర్కొన్నారు. ఆయా శాఖలను సమన్వయం చేసి 216 మత్స్యకార కుటుంబాలకు వరద నష్టపరిహారం అందేలా చేయడంలో సఫలీకృ తులమయ్యామని వివరించారు. ఇకపై ప్రకృతి విపత్త సమయాల్లో లంకల నుంచి వచ్చే మత్స్యకారులతో పాటు కోటిలింగాలపేట మత్స్యకారులకు కూడా వరద సహాయం అందుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు

# ఆత్రేయపురంలో స్థల వివాదం - ఇద్దరు వర్గాల మధ్య ఉద్రిక్తత




**ఆత్రేయపురం,పెన్ పవర్ నవంబర్ 9** :ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి రామభద్ర రాజుకు సంబంధించిన స్థలంలో ఫినిషింగ్ పనులు జరుగుతున్న సమయంలో వివాదం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, అదే గ్రామానికి చెందిన అల్లూరు ప్రసాద్ రాజు వర్గానికి చెందిన వ్యక్తులు ఆ స్థల యజమానిని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, దౌర్జన్యంగా స్థలంలో ప్రవేశించి, ఇప్పటికే పూర్తయిన ఫినిషింగ్ పనులను తొలగించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ముదునూరి రామభద్ర రాజు ఆత్రేయపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ఎస్. రాము కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అదేవిధంగా, అల్లూరు ప్రసాద్ రాజు వర్గం వ్యక్తులు గ్రామ రోడ్డును అడ్డగించిన ఘటనపై వీఆర్ఓ నివేదిక ఆధారంగా మరో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు

# సఫాయి కర్మచారి నిరుద్యోగ యువతకు ఎన్ఎస్ కె ఎఫ్ఎసీ పథకంలో రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 9:** తూర్పు గోదావరి జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్కెఎఫ్ఎసీ పథకంలో భాగంగా సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను సబ్సిడీపై మంజూరు చేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జె. సత్యవతి తెలిపారు.ఆసక్తి , అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను తూర్పు గోదావరి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం, ప్రగతి భవన్, జనరల్ ఆసుపత్రి ఎదురుగా, కాకినాడ అనే చిరునామాకు పోస్టులో లేదా వ్యక్తిగతంగా సమర్పించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 62818-17023 నంబరును సంప్రదిం చాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఐదుగురు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడవలెనన్నారు.

ప్రతి సభ్యుడు సఫాయి కర్మచారి సర్టిఫికేట్ తప్పనిసరిగా కలిగి ఉండాలి.

గ్రూపులో కనీసం ఒకరికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండా లన్నారు. గ్రూపు ప్రధాన సభ్యుడు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల ష్యూరిటీలు సమర్పించాలి.పథకం కింద సబ్సిడీ మినహా మిగిలిన రుణాన్ని ఆరు శాతం వడ్డీతో 72 నెలసరి వాయిదాల్లో (ప్రతి నెల రూ.33,064/-) చొప్పున క్రమంగా చెల్లించవలెనన్నారు.

# బయో రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, నవంబర్ 9 :** ప్రకృతి వ్యవసాయం రైతులకు తక్కువ వ్యయంతో అధిక నాణ్యత కలిగిన ఉత్పత్తుల లు అందించే మార్గమని పోలవరం ఎమ్మెల్యే ఛిర్రి బాలరాజు అన్నారు. ఆదివారం అంకన్న గూడెం గ్రామంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య, ప్రకృతి వ్యవసాయం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బయో రీఛార్జ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కేంద్రాలు రైతు భరోసా పర్యావరణ రక్షణకు తోడ్పడతాయని అన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన కషాయాలు, విత్తనాలు ,జీవామృతం ఇతర సహజ ఉత్పత్తులు రైతులకు సులభంగా అందుబాటులో ఉంటాయని అన్నారు .కనుక రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైదా ముత్యాలమ్మ, జడ్పిటిసి మల్లం వసంతరావు, జీలుగుమిల్లి సొసైటీ చైర్పర్సన్ సరిపల్లి సత్యనారాయణ రాజు, టిడిపి సీనియర్ నాయకులు సోయం శేఖర్, ఎంటిఎల్ మాధుర్య, యూనిట్ ఐ సి ఆర్ పి లు దుర్గమ్మ, ప్రకాష్ ,నాగేంద్ర కుమార్, సుదర్శన్ ,మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సన్మార్గంలో నడవాలి






రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ప్రేరణాత్మక కార్యక్రమం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 9**
జిల్లా కలెక్టర్ సూచనల మేరకు స్థానిక రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో సమీకృత బీసీ బాలికల వసతి గృహం లో ఆది వారం "ఉత్తమ విద్య - సన్మార్గం" అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వామి అర్చనా నంద, స్వామి శశికాంతా నందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞయానందజీ మహరాజ్, వీర్రాజు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఉత్తమ విలువలతో కూడిన విద్యను అభ్యసించి, సమాజానికి ఉపయోగపడే సన్మార్గంలో నడవాలని వారు ఉపదేశించారు. విద్యార్థినులకు వివేకానంద సూక్తుల పుస్తకాలు, స్వీట్లు, పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.బి.సి.డబ్ల్యూ.ఓ. ముత్యాల సుబ్బారావు, హెచ్.డబ్ల్యూ.ఓ. ఏ. సూర్యకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## భారతీయ కాపు సేన రాష్ట్ర యువత, కాకినాడ జిల్లా ఇన్చార్జిగా పాము సూరిబాబు





**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 9:** భారతీయ కాపు సేన రాష్ట్ర యువత అధ్యక్షులుగా, కాకినాడ జిల్లా ఇన్చార్జిగా పాము సూరిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పాము సూరిబాబుకు భారతీయ కాపు సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కాలవ వెంకటేశ్వరరావు(కన్నా) నియామక పత్రం అందించి ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాపు రిజర్వేషన్ కోసం తాము వల పెరగని పోరాటం చేస్తామన్నారు. కాపు కార్పొరేషన్ రుణాలు నిజమైన కాపులకు అందేలా చూస్తామన్నారు. భారతీయ కాపు సేనకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కాపు కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ హాల్ కోసం కూటమి ప్రభుత్వంతో మాట్లాడి వాటిని సాధిస్తామన్నారు. కాపు జాతి అభివృద్ధి కోసమే తమ పోరాటం అన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందిస్తామన్నారు. నిరుపేదల కాపులకు ఫలాలు అందించేందుకే తమ పోరాటం అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు వన్నంరెడ్డి భవాని, భారతీయ కాపు సేన క్రమశిక్షణ మరియు ప్రోటోకాల్ రాష్ట్ర మీడియా అధ్యక్షులు సాలిపల్లి శివాజీ, భారతీయ కాపు సేన జాతీయ సలహాదారులు సైతాన నాగేశ్వరరావు, రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ కొల శ్రీహరి రావు, రాష్ట్ర యూత్ కార్యదర్శి మండెల వరుణ్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు ముప్పన రత్నం, సుంకర గణేష్ కుమార్, పశ్చిమగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలు నార్ని వాణి, పిఠాపురం మండల యూత్ ప్రెసిడెంట్ గాది శ్రీ సాయి శివ దుర్గ, అనపర్తి నియోజకవర్గం యూత్ అధ్యక్షులు ఎర్రంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో పంచమి, పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు





**వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 9:** కార్తీక మాసంలో పంచమి పునర్వసు నక్షత్రం సందర్భంగా మండలంలోని గౌరబంద శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదివారం గౌరబంద కాశీ విశ్వేశ్వర స్వామి శివాలయములో భక్తులు కార్తీక మాసం సందర్భంగా హెూమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో ఆదివారం అయ్యప్ప , భవాని భక్తులుల తో పాటు వందలాది భక్తులు శివాలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చరణాల మధ్య భక్తులు హెూమం నిర్వహించారు. భక్తులు శివ లింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం పంచమి పునర్వసు నక్షత్రం సందర్భంగా కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు కూడా రావడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వయంభూగా వెలిసిన శివాలయములో పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు. హెూమం పూజా కార్యక్రమాల అనంతరం అన్న సమారాధన జరిపించామని తెలిపారు. అటవీ ప్రాంతంలో ఉన్న శివాలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వైరామవరం ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు.

## ప్రత్తిపాడు ఆర్ సి ఎం నూతన విచారణకర్తకు కిర్లంపూడిలో అపూర్వ స్వాగతం.





**కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్ 9:** ప్రత్తిపాడు ఆర్ సి ఎం, నూతన విచారణ కర్తగా నియమితులైన రెవరెండ్ ఫాదర్ ఓమ్మి మోహన్ ప్రసాద్ కు మండల కేంద్రమైన కిర్లంపూడి ఆర్ సి ఎం చర్చి సంఘస్తులు ఆదివారం అపూర్వ స్వాగతం పలికారు. ప్రత్తిపాడు విచారణ కర్తగా పనిచేసిన రెవరెండ్ ఫాదర్ కె చిన్నప్ప కిర్లంపూడిలో ఆర్ సి ఎం, నూతన దేవాలయం నిర్మాణానికి ఎంతో కృషి చేసి ఇటీవల బదిలీపై విజయనగరం జిల్లా పెంటపాడు వెళ్లడంతో రోమన్ క్యాథలిక్ పెద్దలు బొబ్బిలిలో విచారణ కర్తగా పనిచేస్తున్న రెవరెండ్ ఫాదర్ ఓమ్మి మోహన్ ప్రసాద్ ను ప్రత్తిపాడు బదిలీ చేశారు. దీంతో ప్రతిపాడులో అనుబంధంగా ఉన్న కిర్లంపూడి ఆర్ సి ఎం నూతనం దేవాలయానికి తొలిసారిగా విచ్చేయడంతో చర్చి వీధిలో ఉన్న ఆర్.సి.యం శిలా తోరణం దగ్గర నుండి సంఘ పెద్దలు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో సంఘస్తులు పాల్గొని చర్చి వరకు పూలాభిషేకాలతో అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చర్చిలో తొలి ఆదివారం మోహన్ ప్రసాద్ అందించిన దైవ సందేశం సంఘస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు అధిక సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సంఘ పెద్దలు మాట్లాడుతూ రెవరెండ్ ఫాదర్ ఓమ్మి మోహన్ ప్రసాద్ ప్రత్తిపాడు నూతన విచారణ కర్తగా నియమితులై తొలిసారిగా కిర్లంపూడి ఆర్సీఎం చర్చిలో అడుగుపెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆధ్వర్యంలో సంఘం మరింత బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

## ముద్రగడను కలసిన దళిత, గిరిజన, బీసీ, ముస్లిం,క్రైస్తవ ఐక్య సంఘం వేదిక నాయకులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్ 9:** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి లో మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ను ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ను కాకినాడ కు చెందిన దళిత, గిరిజన, బిసి, ముస్లిం, క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు కలిశారు. ముద్రగడ పద్మనాభంను కలిసిన అనంతరం దళిత గిరిజన బీసీ ముస్లిం ఐక్యవేదిక నాయకులు ముద్రగడ పద్మనాభంతో ఉన్న అనుబంధం మరవలేనిదన్నారు. రాజకీయాల్లో నేటికీ నీతి నిజాయితీ గల నాయకుడిగా, బలహీన వర్గాలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉన్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డోకు బుర్ర భద్రం, వరిపల్లి శివాజీ, గణేషన్, ఆవుపాటి ఉమాశంకర్, సాపే సుధాకర్, కొండేపూడి రవికుమార్, మాచిగిరి రాంబాబు, నందిక వీరబాబు, సిద్ధాంతపు రాజు, అమలదాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.ం

## ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయి అఖండ నామ సంకీర్తన



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్9:** ప్రపంచ శాంతిని కోరుతూ లోక కళ్యాణార్థం పరిపూర్ణ మహా అవతార్ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ప్రపంచ వ్యాప్త అఖండ నామ సంకీర్తన రావులపాలెం సత్యసాయి అష్టదళ సేవా పుష్పం (సేవా కేంద్రం)లో అత్యంత వైభవంగా నిర్వహించారు.అనంతరం ఈమని సత్తిబాబు బ్రహ్మత్వంలో సహస్ర సాయి గాయిత్రి హెూమ యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సేవాసంస్థ చైర్మన్ కొవ్వూరి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహంతో ప్రపంచ శాంతిని కోరుతూ సత్యసాయి బాబా వారి శతజయంతోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి సేవా కేంద్రాల్లో శనివారం సాయంత్రం 6-00గంటలనుండి ఆదివారం సాయంత్రం 6-00గంటల వరకు ఏకధాటిగా 24 గంటలు పాటు సత్యసాయిబాబా నామ సంకీర్తన (భజన) జరుగుతుందని అది వారం సాయంత్రం 6-00 గంటలకు మహా మంగళ హారతితో ముగుస్తుంది ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఘనంగా జగ్గంపేట కాపు సంఘం వన సమారాధన



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 9:** జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు మీసాల చిన్నబాబు ఆధ్వర్యంలోఆదివారం కాపు వన భోజన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జగ్గంపేట పరిసర ప్రాంతాల నుంచి ఐదు వేల మంది కాపు కుటుంబాల నుంచి హాజరై ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, తోట త్రిమూర్తులు, వరుపుల సుబ్బారావు, వంగా గీత, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు , కాకినాడ మాజీ మేయర్ నాగిరెడ్డి చంద్రకళ దీప్తి, జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, అరుణాచల మాధవి, కాపు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల కాపు నాయకులు, హాజరై ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం చిన్నారుల కూచిపూడి నాట్యాలతో ఆహుతులను అలరించారు. అనంతరం అరుణాచల మాధవి తన ప్రవచనాలతో పరమశింపజేశారు. జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ క్విజ్ పోటీల ద్వారా సేకరించిన లక్ష 14 వేల రూపాయలు కాపు సంక్షేమానికి ఉపయోగించాలని సంఘ అధ్యక్షులు మీసాల చిన్నబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాపు సామాజిక భవనానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షలు గ్రాంటు అందిస్తానని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కాపు సామాజిక భవనానికి అన్ని రకాల ఫంక్షన్ లు నిర్వహించాలంటే భోజనశాల, వంటగది, వాచ్ మ్యాన్ రూము అవసరమని వీటిని తన సొంత నిధులతో తన తండ్రి జ్యోతుల నాగేశ్వరరావు గారి పేరు మీద తొందర్లోనే నిర్మాణం చేపడతానన్నారు. అదేవిధంగా 10 అతిధి రూములు నిర్మించేందుకు దాతలు ముందుకు వస్తే వారి పేర్లు మీద నిర్మించేందుకు సహకరించాలని కోరారు.

# తటస్థ ఓటర్లే జూబ్లీ ఫలితాన్ని డిసైడ్ చేసేది!

**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్ గా మారిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన ఆసక్తికర చర్చ ఒకటి ఇప్పుడు ప్రధాన రాజకీయ పార్టీలకు నిద్ర లేకుండా చేస్తోంది. జూబ్లీహిల్స్ లోని 4 లక్షల ఓటర్లలో ఎంత మంది పోలింగ్ రోజున ఓట్లు వేసేందుకు వస్తారు? వీరిలో ఏ వర్గానికి ఎంత వాటా ఉందన్నది ఒక చర్చ అయితే.. పార్టీల పరంగా కాకుండా తటస్థంగా ఉండే ఓటర్లు వేసే ఓటే.. జూబ్లీహిల్స్ విజేతను డిసైడ్ చేస్తారని అంటున్నారు. అదెలా అంటే.. దానికి అసలు కారణం ఒకటుంది.సాధారణంగా ఎన్నికలు ఏవైనా.. తటస్థ ఓటర్లు ఐదు నుంచి ఆరు శాతం వరకు ఉంటారు. ఎన్నికల ఫలితాల్ని వీరు డిసైడ్ చేయలేరు. కానీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మాత్రం అందుకు భిన్నంగా తటస్థ ఓట్లు 16 శాతం ఉన్నట్లుగా సర్వే సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. అంటే.. వంద మంది ఓటు వేస్తే.. వారిలో 16 మంది తాము ఎవరికి ఓటు వేసే విషయాన్ని పోలింగ్ రోజున డిసైడ్ అయ్యే వీలుందంటున్నారు.ఇప్పటికే హోరాహోరీగా.. నువ్వా నేనా? అన్న రీతిలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్.. బీఆర్ఎస్ లు పోటాపోటీగా ప్రచారం చేస్తున్న వేళ.. మెజార్టీ చాలా తక్కువగా వచ్చే వీలుంది. ఇలాంటి వేళలో.. పార్టీలకు అతీతంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటేసే తటస్థ ఓటర్లు 16 శాతం ఉండటంతో.. వారి ఓటే కీలకంగా మారనుంది. వారు ఎటువైపు మొగ్గితే విజయం వారి పక్షాన నిలుస్తుందని చెబుతున్నారు.ఇదంతా ఒక ఎత్తు అయితే జూబ్లీహిల్స్ ఉపపోరులో మొత్తం ఆరు డివిజన్లు ఉన్నాయి.




వాటికి సంబంధించి అధికార కాంగ్రెస్.. విపక్ష బీఆర్ఎస్ కు చెందిన కీలక నేతలు ఎవరికి వారు తమకు పట్టున్న డివిజన్ల లెక్క వారు చెబుతున్నారు. మెజార్టీ డివిజన్లలో తమకే పట్టు ఉందంటూ పోటాపోటీగా లెక్కలు చెబుతున్న నేపథ్యంలో.. ఉప ఎన్నికల ఫలితాలే నిజమేమిటన్నది డిసైడ్ చేస్తారని చెప్పాలి. అందుకు మరో వారం వెయిట్ చేయక తప్పదు.

# రియల్ పుష్పలు ఈ నలుగురేనా..! గబ్బర్ సింగ్ లిస్టు వైసీపీ నేతలదేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎర్ర చందనం స్మగ్లర్లకు వార్నింగు ఇస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తిరుపతి ప్రాంతంలో నలుగురు కింగ్ పిన్స్ ఉన్నట్లు తనకు సమాచారం ఉందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికైనా స్మగ్లింగు ఆపేయాలని లేదంటే తన యాక్షన్ ఎలా ఉంటుందో చూస్తారని పవన్ చాలా సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. ప్రధానంగా పర్యావరణంతోపాటు ఆధ్యాత్మికతను మేలవించి ఎర్రచందనంపై పవన్ చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే ఈ విషయంలో ఆయన కఠినంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని అంటున్నారు.ఎర్రచందనం స్మగ్లింగును ఉక్కుపాదంతో అణిచివేస్తానని పవన్ వార్నింగు ఇవ్వడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహం కూడా ఉందని అంటున్నారు. తన సొంత ప్రాంతమైన తిరుపతిలో ఎర్రచందనం స్మగ్లింగులో ప్రతిపక్ష వైసీపీ నేతల పాత్రపై ముఖ్యమంత్రికి అవగాహన ఉందని అంటున్నారు. ఆయన ప్రోద్బలంతోనే పవన్ రంగంలోకి దిగినట్లు చెబుతున్నారు. తాను ఏం అనుకున్న మొండిపట్టుదలతో సాధించే గుణం ఉన్న పవన్ అయితేనే ఒత్తిళ్లకు తల వంచక పని చేస్తారన్న నమ్మకంతోనే చంద్రబాబు ఈ బిగ్ టాస్క్ ఇచ్చి పవన్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్సును రంగంలోకి దించారని అంటున్నారు.ఇక ముఖ్యమంత్రి మార్గనిర్దేశంలో రంగంలోకి దిగిన పవన్.. ఎర్రచందనం చెట్లకు బార్ కోడింగ్ తీసుకురావడంతోపాటు టాస్క్ ఫోర్సుకు పూర్తి అధికారాలకు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు



చెబుతున్నారు. ఇందులో భాగంగా 'ఆపరేషన్ కగార్'ను ప్రస్తావించిన పవన్.. అవసరం అనుకుంటే స్మగ్లర్ల ఎన్ కౌంటర్లకు వెనుకాడబోమని సంకేతాలిచ్చినట్లు చెబుతున్నారు. ఇక డిప్యూటీ సీఎం పవన్ రంగంలోకి దిగిన తర్వాత రెడ్ సాండిల్ స్మగ్లర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఎర్రచందనం స్మగ్లింగు ఎక్కువగా జరిగిందని పవన్ ఆరోపిస్తుండగా, నలుగురు వైసీపీ నేతలపై ఉన్న అనుమానాలకు ఏమైనా ఆధారాలు లభించాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పవన్ పర్యటన తర్వాత రీల్ పుష్పలో ఉన్నట్లే పుష్ప, కొండారెడ్డి, మంగళం శ్రీను, మురుగన్ పాత్రధారులు రియల్ స్టోరీలోనూ ఉన్నారా? అనే చర్చ జరుగుతోంది. ఈ నలుగురు కింగ్ పిన్స్ ఎవరన్న అనుమానంతో పలువురు నేతల పేర్లతో అంతా ఆరా తీస్తున్నారు.

# ఒలింపిక్స్ 2028 : భారత్ వర్సెస్ పాక్ పోరు లేనట్లే.. కారణమిదే

**హైదరాబాద్ పెన్ పవర్:** లాస్ ఏంజెలెస్ 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడం ఒక చారిత్రక పరిణామం. కానీ ఈ వార్త భారత్–పాకిస్థాన్ అభిమానులకు మిశ్రమ అనుభూతిని ఇస్తోంది. 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్ మళ్లీ భాగం కాబోతున్నప్పటికీ క్రీడాభిమానులు ఎంతగానో ఎదురుచూసే దాయాదుల పోరు భారత్–పాకిస్థాన్ మ్యాచ్ ఈ మెగా ఈవెంట్‌లో జరిగే అవకాశం లేదని తెలుస్తోంది.


**ఒలింపిక్స్‌లో క్రికెట్ చరిత్ర**

చరిత్రలో కేవలం ఒకే ఒక్కసారి 1900లో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను నిర్వహించారు. ఆ పోటీలో బ్రిటన్ జట్టు ఫ్రాన్స్‌ను ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. సరిగ్గా 128 సంవత్సరాల తర్వాత 2028లో లాస్ ఏంజెలెస్‌లో జరగబోయే ఒలింపిక్ క్రీడల్లో క్రికెట్ మళ్లీ భాగం కావడం క్రీడా ప్రపంచంలో ఒక పెద్ద వార్త. ఈ టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు.

**ఐసీసీ నూతన అర్హతా నిబంధనలతో భారత్–పాకిస్థాన్ పోరుకు అడ్డంకి**

అభిమానులకు నిరాశ కలిగించే ముఖ్య కారణం ఐసీసీ రూపొందించిన నూతన అర్హతా నిబంధనలు. ఒలింపిక్స్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను పరిమిత జట్లతో పురుషులు, మహిళల విభాగాల్లో తలా 6 జట్లు నిర్వహించాలని ఐసీసీ నిర్ణయించింది. ప్రతి ఖండం ఆసియా, ఓషియానియా, యూరప్, ఆఫ్రికా నుంచి కేవలం ఒక్క జట్టుకే అవకాశం లభిస్తుంది. ఈ ఎంపిక ఆయా ఖండాల్లోని జట్ల ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా జరుగుతుంది. ఆతిథ్య దేశంగా లాస్ ఏంజెలెస్ 2028 క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్నందున అమెరికా ఈ క్రీడల్లో తప్పనిసరిగా ఓ జట్టుగా ఆడుతుంది.. ర్యాంకింగుల ఆధారంగా ప్రతి ఖండం నుంచి 1 చొప్పున నాలుగు జట్లు వస్తాయి. క్వాలిఫయర్ రౌండ్ ద్వారా 1 జట్టు ను ఎంపిక చేస్తారు.

**ఆసియా నుంచి భారత్‌కే పెద్దపీట**



ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా చూస్తే ఆసియా ఖండం నుంచి భారత్ అత్యుత్తమ ర్యాంకింగ్‌లో ఉంది. ఐసీసీ వర్గాలు అంచనా వేస్తున్న ప్రాంతీయ అర్హత జట్లు చూస్తే ఆసియా నుంచి భారత్, ఓషియానియా నుంచి ఆస్ట్రేలియా, యూరప్ నుంచి ఇంగ్లాండ్, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా, ఆతిథ్య దేశంగా అమెరికా ఆడనున్నాయి. ఈ లెక్కన ఆసియా నుంచి ఒక్క భారత్‌కు మాత్రమే నేరుగా చోటు దక్కుతుంది. దీంతో పాకిస్థాన్‌కు ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం దాదాపుగా లేనట్టే కనిపిస్తోంది. పాకిస్థాన్ అర్హత సాధించాలంటే.. ఒకే ఒక్క స్థానం ఉన్న క్వాలిఫయర్ రౌండ్‌లో విజయం సాధించాల్సి ఉంటుంది, అది కూడా అత్యంత కష్టంతో కూడుకున్న విషయంగా చెప్పొచ్చు. ప్రపంచంలోని అన్ని జట్లకు ఈ క్వాలిఫైయర్స్ లో పోటీపడుతాయి.

అందుకే, ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా చూసే భారత్–పాకిస్థాన్ హై–వోల్టేజ్ మ్యాచ్ 2028 ఒలింపిక్స్ వేదికగా

కనిపించకపోవచ్చనే వార్త నిస్సందేహంగా నిరాశపరిచే అంశం. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఏమైనా ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ పునరాగమనం, ఈ క్రీడను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించడానికి ఒక గొప్ప అవకాశం కల్పిస్తోంది.

ఈ కఠినమైన నిబంధనల కారణంగానే భారత్–పాకిస్థాన్ మధ్య మ్యాచ్‌ను 2028 ఒలింపిక్స్ వేదికగా చూసే అవకాశం అభిమానులకు లేనట్లే అని స్పష్టమవుతోంది. క్రికెట్‌కు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు లభించినప్పటికీ దాయాదుల పోరును మిస్ అవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఐసీసీ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. అసలు ఆట మొదలైంది



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుకుని, ఆదివారం నవంబర్ 9 సాయంత్రం 6 గంటలకు ముగిసింది. మైకులు, ర్యాలీలు, రథాలు మూగబోనున్నాయి.. చివరి రోజున ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ ప్రాభవాన్ని, పట్టుదలను ప్రదర్శిస్తూ మాటల తూటాలతో ప్రత్యర్థులపై దండయాత్ర చేశాయి. పార్టీల నాయకులు ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దీనితో ప్రచారం పీక్‌కు చేరింది.

**చివరి రోజు హోరాహోరీ ప్రచారం**

పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ, అభ్యర్థులు ఓటర్లను వ్యక్తిగతంగా చేరుకోవడానికి ప్రయత్నించారు. అభివృద్ధి వాగ్దానాలు, స్థానిక సమస్యల పరిష్కార హామీలు ప్రచారంలో ప్రధానాంశాలుగా నిలిచాయి. అధికార కాంగ్రెస్ గెలిచి తీరాలని, బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని, బీజేపీ ఇక్కడ సత్తా చాటి రాష్ట్రంలో తమ ఉనికిని బలోపేతం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నాయి. ప్రచారం ఈరోజు ముగియనుండడంతో అసలు ఆట మొదలు కాబోతోంది. పార్టీలన్నీ ఓటర్లకు తాయిలాలు పంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు ప్రచారం సాగుతోంది. పోలీసులు కూడా ప్రలోభాలకు అడ్డుకట్ట వేయడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

**పోలీస్ నిఘా.. వైన్ షాపుల బంద్**

ప్రచార సమయం ముగిసిన వెంటనే ఎన్నికల కోడ్ మరింత కఠినంగా అమలు కానుంది. పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి నవంబర్ 11న సాయంత్రం 6 గంటల వరకు నియోజకవర్గంలో వైన్స్ షాపులు, బార్‌లు మూసివేయబడతాయి. ప్రచారం ముగిసినప్పటికీ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున, డబ్బు పంపిణీని అడ్డుకునేందుకు పోలీసులు ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు.

**ఏపీ ప్రజల 'టెన్షన్'.. వందల కోట్ల బెట్టింగ్‌లు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై తెలంగాణ ప్రజల కంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలే అధిక ఆసక్తిని కనబరుస్తున్నట్లు సమాచారం. ఈ నియోజకవర్గంలో ఏపీ నుంచి వచ్చినవారు అధికంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. అయితే, అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే నియోజకవర్గంలో అనేక హోటళ్లు, లాడ్జీలలో బస చేస్తున్న చాలామంది ఏపీ వ్యక్తులు బెట్టింగ్‌ల కోసమే ఇక్కడికి వచ్చారని ఓ ప్రచారం జోరుగా సాగుతోంది. ఎవరు గెలుస్తారు, ఏ పార్టీ ఓడిపోతుంది.. గెలిచే అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుంది అనే అంశాలపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి సునీత విజయావకాశాలపై ప్రధానంగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయని అంటున్నారు. ఓ అంచనా ప్రకారం ఈ ఉప ఎన్నికలపై దాదాపు ?300 కోట్ల నుంచి ?400 కోట్ల వరకు బెట్టింగులు నడుస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ప్రత్యేక ముఠాగా ఏర్పడి, ఎప్పటికప్పుడు సర్వే చేయించుకుని, దాని ఆధారంగా బెట్టింగుల వ్యవహారాన్ని నడుపుతున్నట్లు సమాచారం.

**ఉప ఎన్నిక కీలక తేదీలు**

నవంబర్ 9 (ఆదివారం) సాయంత్రం 6 గంటలతో ప్రచారం ముగియనుంది. రెండు రోజుల తర్వాత నవంబర్ 11 (మంగళవారం)న పోలింగ్ జరుగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేసింది. ప్రచారం ముగియడం, బెట్టింగ్‌ల జోరు నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం కోసం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# బిగ్ అప్ డేట్... ప్రపంచ పారిశ్రామిక పటంలో కుప్పం ముద్ర!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాష్ట్రం పారిశ్రామికంగా ఊహించని స్థాయిలో అభివృద్ధి చెందుతుందనే కామెంట్లు వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. అటు ఐటీ పరిశ్రమలతో పాటు మరెన్నో పరిశ్రమలు ఏపీ వైపు అడుగులు వేస్తున్నాయి. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ దీనికి తాజా ఉదాహరణ కాగా... అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా కుప్పానికి గుడ్ న్యూస్ చెప్పింది కూటమి ప్రభుత్వం.



అవును... రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అనేది నెగిటివ్ సౌండ్ అయితే.. అదే రాజు తలచుకుంటే అభివృద్ధికి కొదవా అనేది పాజిటివ్ సౌండ్, ప్రస్తుతం ఏపీలో బలంగా వినిపిస్తోన్న సౌండ్ అని అంటున్నారు పరిశీలకులు. అందుకు కారణం ప్రపంచవ్యాప్తంగా దిగ్గజ సంస్థలు ఏపీవైపు అడుగులు వేయడమే. ఈ క్రమంలో తాజాగా ప్రపంచ పారిశ్రామిక పటంలో కుప్పం ముద్ర కనిపించే కీలక పరిణామం చోటు చేసుకుంది.ఇందులో భాగంగా... ప్రఖ్యాత ఆదిత్య బిర్లా గ్రూప్ కు చెందిన హిందాల్కో ఇండస్ట్రీస్ కుప్పంలో కొత్త అల్యూమినియం ఎక్స్ ట్రూషన్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడానికి రూ.586 కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఈ ప్లాంట్ ఐఫోన్ ల కోసం హై–గ్రేడ్ అల్యూమినియం ఛాసిస్ ను ఉత్పత్తి చేస్తుంది. అంటే.. ఈ కీలకమైన ఆపిల్ భాగాలు ఇప్పుడు కుప్పంలో తయారు చేయబడతాయన్నమాట. ఇది కుప్పానికి మహా గొప్ప శుభవార్త!

**మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు!:**

ఈ సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఆదిత్య బిర్లా గ్రూపుకు చెందిన హిందాల్కో ఇండస్ట్రీస్ రాష్ట్రానికి రావడం మన ఎలక్ట్రానిక్స్ ఎకో సిస్టంలో కీలక మలుపని అన్నారు. ఈ కీలక పరిణామం ద్వారా యాపిల్ గ్లోబల్ సప్లై చైన్ లో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామి కానుందని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఎక్స్ వేదికగా వెల్లడించారు.ఇందులో భాగంగా... కుప్పంలో రూ.586 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక అల్యూమినియం ఎక్స్ ట్రూజన్ ప్లాంట్ ఏర్పాటు కాబోతుందని.. దీనిద్వారా సుమారు 613 మందికి ప్రత్యక్షంగా, మరెందరికో పరోక్షంగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని వెల్లడించారు. వేగవంతమైన అనుమతులు, ప్రోత్సాహకాల కారణంగానే ఇది సాధ్యమైందని తెలిపారు.ఇదే సమయంలో... బెంగళూరుకు 120 కి.మీ, చెన్నైకి 200 కి.మీ దూరంలో వ్యూహాత్మక స్థానంలో కుప్పం ఉందని చెప్పిన నారా లోకేష్... భవిష్యత్తులో స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో గ్లోబల్ తయారీ కేంద్రంగా ఈ ప్రాంతం మారనుందని.. 2027 మార్చి నాటికి ఈ యూనిట్ నుంచి పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

**ప్రపంచానికి దిక్సూచిగా కుప్పం!:**

మరోవైపు శనివారం కుప్పం నియోజకవర్గంలో 241 ఎకరాల్లో రూ.2,203 కోట్లతో ఏడు పరిశ్రమలకు వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఆయన.. భూసేకరణకు రైతులు సహకరించారని.. నాయకులు సమిష్టిగా పనిచేసారని అన్నారు. ప్రతి ఇంటి నుంచీ ఒక్కొక్కరు వ్యాపారవేత్తగా ఎదగాలని, అదే తన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.

# 'తిరువూరు'లో తప్పు అంతా అతడిదే.. చంద్రబాబు చేతికి నివేదిక?




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో తుఫాన్ రేపిన తిరువూరు పంచాయితీపై అధినేత చంద్రబాబుకు నివేదిక అందింది. పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలోని క్రమశిక్షణ సంఘం సభ్యులు తిరువూరు నివేదిక సమర్పించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అలియాస్ చిన్నిపై తీవ్ర ఆరోపణలు చేస్తూ పత్రికలకు ఎక్కిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పార్టీ నిబంధనలను అతిక్రమించారని క్రమశిక్షణ సంఘం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా సిఫార్సు చేస్తూ అధినేత చంద్రబాబుకు నివేదిక సమర్పించారు.అందరూ ఊహించినట్లే తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడిదే తప్పని క్రమశిక్షణ సంఘం తేల్చేసింది. ఎమ్మెల్యేగా గెలిచిన రెండో రోజు నుంచే కొలికపూడి వివాదాస్పదంగా వ్యవహరించడాన్ని క్రమశిక్షణ సంఘం ప్రస్తావించింది. ఇక ఆయన అన్ని హద్దులూ దాటేస్తున్నట్లు అభిప్రాయపడింది. ఎమ్మెల్యే విషయంలో అధినేత చంద్రబాబు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందిగా సూచించింది. ఎంపీ కేశినేని చిన్నిపై ఎమ్మెల్యే చేసిన ఆరోపణలకు సంబంధించి ఒక్క ఆధారమూ సమర్పించలేదని స్పష్టం చేసింది. ఎమ్మెల్యే అధికారాలకు కత్తెర వేయడం లేదా సస్పెన్షన్ విధించాలని సిఫార్సు చేసింది. అయితే తుది నిర్ణయాన్ని అధినేత చంద్రబాబుకే వదిలేసింది.ఇక తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వైఖరిపై ఇప్పటికే ఆగ్రహంగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఉత్కంఠ నెలకొంది. గత ప్రభుత్వంలో అమరావతి రైతుల తరపున పోరాడిన కొలికపూడి రాజకీయాల్లో ఇమడలేకపోతున్నారని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగా ఆయనతో మాట్లాడాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ఉద్యమం, రాజకీయం వేర్వేరుగా ఉంటుందని, ఈ విషయం తెలుసుకోలేక కొలికపూడి దూకుడుగా వ్యవహరిస్తూ వివాదాల్లో చిక్కుకుంటున్నారని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.అయితే ఇటీవల ఆయన వైసీపీ ట్రాప్ లో పడ్డారని మరికొందరు నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పార్టీకి తలనొప్పులు తెస్తున్న కొలికపూడిపై నియోజకవర్గ కేడర్ లో కూడా సానుకూల అభిప్రాయం లేదని ఫిర్యాదులను పార్టీ సీరియస్ గా పరిగణించింది. అందుకే ఆయన విషయంలో మరో చాన్స్ ఇవ్వకూడదన్నట్లే అధినేతకు సిఫార్సులు చేసినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే కొలికపూడి భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేతో మాట్లాడతానని చెప్పడంతో ఆయనకు ఫైనల్ గా మరోసారి చాన్స్ ఇస్తారా? లేక అధికారాలకు కత్తెర వేసి పార్టీ నుంచి స్వచ్ఛందంగా బయటకు వెళ్లేలా పొగబెడతారా? అనేది చూడాల్సివుందని అంటున్నారు.

# పవన్ వర్సెస్ లోకేశ్.. వైసీపీ కోరుకున్నది ఇదే కదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ పాలిటిక్స్ లో స్టార్ ఇమేజ్ ఉన్న ఇద్దరు మంత్రులు మధ్య పోటీ నెలకొందా? ఆ ఇద్దరి మధ్య చిచ్చు రావాలని, పొత్తు పెటాకులు అవ్వాలని ప్రత్యర్థి పార్టీ వైసీపీ కోరుకుంటున్నట్లే జరుగుతుందా? అనే చర్చ జరుగుతోంది. కూటమిలో కీలకంగా పనిచేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, టీడీపీ యువనేత, ఐటీ మంత్రి లోకేశ్ మధ్య జరుగుతున్న పోటీ ఆసక్తిరేపుతోంది. అయితే ఈ ఇద్దరి మధ్య ప్రత్యర్థి పార్టీ వైసీపీ కోరుకుంటున్న తరహా మాత్రం కనిపించడం లేదని, రాజకీయాల్లో ఇంతకు ముందు ఎన్నడూ చూడని విధమైన పోటీ జరుగుతోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి నారా లోకేశ్ తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నాటికి లోకేశ్ తో పోల్చితే పవన్ కు పాలనపై ఎటువంటి అవగాహన లేదు. లోకేశ్ గతంలో ఎమ్మెల్సీగా మంత్రిగా పనిచేశారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడిగా పాలనపై కొంతమేర అవగాహనతో కూటమి ప్రభుత్వంలో రెండోసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇదే సమయంలో పవన్ పదేళ్ల పాటు ప్రతిపక్ష పాత్ర పోషించారే కానీ అధికారం కొత్త. కానీ, ఇప్పుడు ప్రభుత్వంలో మిగిలిన మంత్రులు కన్నా, మెరుగైన విధంగా పవన్ పనిచేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జనసేన అధినేతగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు కూటమిలో పూర్తి స్వేచ్ఛ లభించింది. ముఖ్యమంత్రి కుమారుడిగా లోకేశ్ కూడా పూర్తి అధికారాలు చలాయిస్తున్నారు. సహజంగా ఎక్కడైనా ఇలా రెండు అధికార కేంద్రాలు ఉంటే ఆటోమెటిక్ గా విభేదాలు పొడసూపుతాయి. ఈ కారణంగానే వైసీపీ కూడా ఆ ఇద్దరి మధ్య పొరపొచ్చాలు రావగా, మంట మరింత రాజేసి రాజకీయంగా లబ్ధి పొందే అవకాశం దక్కకపోతుందా? అని ఎదురుచూస్తుంది. కానీ, పవన్, లోకేశ్ మాత్రం ఆ అవకాశం ఇవ్వకుండా చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారని అంటున్నారు. కూటమి మరో 15 ఏళ్లు కొనసాగుతుందని పవన్ పదేపదే చెబుతున్నారు. అదే సమయంలో తన తోడ పుట్టకపోయినా అన్నగా భావిస్తున్నానని పవన్ తో అనుబంధం కొనసాగించేందుకు లోకేశ్ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇదే సమయంలో సోషల్ మీడియాలో రెండు పార్టీల మధ్య చిచ్చు రేగేలా జరుగుతున్న ప్రచారాన్ని తాము నమ్మే పరిస్థితుల్లో లేమని తేల్చిచెబుతున్నారు. కేడర్ ను కూడా ఆ దిశగా ఎడ్యుకేట్ చేస్తున్నారు. ఇద్దరు నేతలు ఈ విషయంలో చక్కటి సమన్వయంతో నడుచుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మరోవైపు అధికార బాధ్యతలు, క్షేత్రస్థాయి పర్యటనల్లో కూడా ఇద్దరూ పరస్పరం పోటీ పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒకరు అధికారులతో సమన్వయం చేసుకుంటే, మరొకరు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళుతున్నారు. ఒకరు క్షేత్రస్థాయిలో ఉంటే మరొకరు సచివాలయంలో సమీక్షలతో ప్రభుత్వ వ్యవహారాలను చక్కబెడుతున్నారు. మీడియా కవరేజ్ విషయంలో కూడా ఈ ఇద్దరి మధ్య క్రాస్ ఫైర్ జరగకుండా కార్యక్రమాలను ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల పవన్ కృష్ణా జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళితే ఆ సమయంలో లోకేశ్ రాజధాని అమరావతిలో తుఫాను బాధితుల సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించడం చూస్తే ఈ ఇద్దరి మధ్య పరస్పర సమాచారం, సమన్వయం చక్కగా ఉన్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. అదేవిధంగా పవన్ తిరుపతి వెళితే, అదే సమయంలో లోకేశ్ అనంతపురంలో పర్యటించడాన్ని ప్రస్తావిస్తున్నారు. మరోవైపు పవన్ మాస్ ఇమేజ్ కూడగట్టే కార్యక్రమాలకు వెళుతుంటే, లోకేశ్ పెట్టుబడులు, పారిశ్రామిక వేత్తలతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రగతికి అడుగులు వేస్తున్నారని అంటున్నారు. పవన్ గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వానికి మద్దతు కూడ గట్టే ప్రయత్నం చేస్తుంటే, పవన్ పట్టణ ప్రాంతాల్లో పర్యటించి యువతలో సానుకూలత పెంచుకునేలా పనిచేస్తున్నారని అంటున్నారు. మొత్తానికి ఇద్దరు మంత్రులు వ్యవహార శైలి కూటమికి కొత్త ఊత్సాహం ఇస్తుండగా, వైసీపీ ఉసూరుమనిపిస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు.

# అమ్మో ఆఫ్రికన్ నత్తలు.. పల్లెల నుంచి హైదరాబాద్ వరకు ఒకటే దడ!



**హైదరాబాద్ పెన్ పవర్:** "నత్తలు వస్తున్నాయి జాగ్రత్త" అనేది మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన ఒక సైన్స్ ఫిక్షన్ నవల. వేరే ప్రదేశం నుంచి తీసుకువచ్చిన ఒక జీవి వల్ల కలిగే ప్రమాదాలు, విపత్తుల గురించి ఈ నవలలో వివరిస్తారు. భవిష్యత్తును ఊహించి మల్లాది రాసినట్లు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో నత్తలు హడలెత్తిస్తున్నాయి. ఏపీలోని మారుమూల శ్రీకాకుళం జిల్లా నుంచి అటు చిత్తూరు వరకు.. ఇటు తెలంగాణలోని హైదరాబాద్ మహనగరంలో కూడా ఎక్కడ విన్నా ఇప్పుడు నత్తల దండు కోసమే చర్చ జరుగుతోంది. వేలాదిగా నత్తల దండు దాడులతో పంట పొలాలు గుల్ల అవుతున్నాయి.కొంతకాలంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నత్తల బెడదపై పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. కీటక జాతికి చెందిన ఈ నత్తలు ఎప్పుడో 300 ఏళ్ల క్రితం ఆఫ్రికా నుంచి మన దేశానికి వచ్చాయి. ఇక ఇటీవల కాలంలో కేరళ నుంచి తీసుకువచ్చిన వక్క తోటల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో చేరినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కోనత్త ఏడాదిలో వెయ్యి నుంచి రెండువేల గుడ్లు పెడతాయని చెబుతున్నారు. పగటిపూట ఎక్కడా కనిపించని నత్తలు రాత్రిపూట పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. తెల్లారి చూసేసరికి పంట అంతా సర్వనాశనం అయిపోతోంది.పొలాల్లో తుప్పలు, ఆకుల కింద గాలి, వెలుతురు తగలని చోట ఉంటున్న నత్తలను పట్టుకునే రైతులు, రైతు కూలీలకు చర్మవ్యాధులు వస్తున్నాయి. ఒకవైపు పంటల దెబ్బతింటూ మరోవైపు మనుషుల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్న నత్తలను సామూహికంగా నివారించాల్సిన అత్యావసరం ఉందని రైతులు కోరుతున్నారు. రెండు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక చోట నత్తల దాడితో పంటలు దెబ్బతింటున్నాయని, ఈ సమస్య మరింత తీవ్రం అవ్వకముందే ప్రభుత్వాలు మేలుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.కొన్నాళ్ల క్రిత పల్లె ప్రాంతాలకే పరిమితమైన నత్తలు తాజాగా హైదరాబాదులోని ఓల్డ్ బోయినపల్లిలో కూడా కనిపించాయి. ఇవి అక్కడ చెట్లకు చెట్లనే తినేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆఫ్రికా నత్తల సంతానోత్పత్తి రేటు అధికంగా ఉండటం వల్ల సమస్య తీవ్రత మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. ఇది ద్విలింగ జాతికి చెందినది కావడంతో రెండేళ్ల వయస్సు లోనే సంతానోత్పత్తి ప్రారంభిస్తుందని అంటున్నారు. ఇక జూలై నుంచి ఫిబ్రవరి వరకు సంతానోత్పతికి అనువైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం వీటి సంతానోత్పత్తికి అనుకూల సమయం కావడంతో బెడద మరింత ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నెట్టింట ఎందరో భాస్కర్ రెడ్డిలు.. అందరికీ ఇవి స్ట్రాంగ్ హెచ్చరికలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా రాజకీయాల్లో వికృత చేష్టలు పెరిగిపోతున్నాయనే చర్చ విపరీతంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. రాజకీయ ప్రత్యర్థిని విమర్శించాలంటే.. ఆ విమర్శ హుందాగా ఉండాలనే ఇంగితం మరిచిపోతున్నారు. పైగా సదరు రాజకీయ నాయకుడి భార్యను, కుటుంబ సభ్యులను సైతం దూషించడం.. మార్ఫింగ్ ఫోటోలు సృష్టించే నీచానికీ ఒడిగడుతున్నారు. అలాంటి వారికి ఓ లెసన్ భాస్కర్ రెడ్డి ఉదంతం! అవును... ఇటీవల రాజకీయాల్లో సోషల్ మీడియాని పనికిమాలిన పనులకు వాడుతున్నవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. ఓ విషయంపై విమర్శించాలంటే.. అది సబ్జెక్ట్ పరంగా ఉండటం మారిపోతోంది. ప్రత్యర్థి నాయకుడితో ఏదో పూర్వజన్మ వైరం ఉందన్నంత స్థాయిలో విమర్శలు వికృతరూపం దాలుస్తున్నాయి. అసహ్యం కలిగిస్తున్నాయి. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో తాజాగా భాస్కర్ రెడ్డి అరెస్టయ్యారు! సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చినట్లు చెబుతున్న భాస్కర్ రెడ్డి.. లండన్ వెళ్లారు. ఈ క్రమంలో గత కొంతకాలంగా చంద్రబాబు, పవన్, లోకేష్ తో పాటు వారి కుటుంబ సభ్యులపైనా శృతిమించిన, వికృత పోస్టులు పెట్టడం మొదలుపెట్టారు! ఏడు సముద్రాల అవతల ఉన్నాములే.. మమ్మల్ని ఎవరు ఏమి చేస్తారనే నమ్మకమో, ధైర్యమో, అజ్ఞానమో, అమాయకత్వమో తెలియదు కానీ.. నిరాటంకంగా చెలరేగిపోయారు! కట్ చేస్తే... ఆయన ఏపీకి రావాల్సి వచ్చింది. తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనడానికి ఆయన వచ్చారు. దీనికి సంబంధించిన సమాచారం పోలీసులకు అందింది. దీంతో.. రంగంలోకి దిగిన పోలీసులు అత్యంక్రియలు పూర్తి చేసిన వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు సమయంలో తనను పోలీసులు గట్టిగా కొట్టారని ఆయన ఆరోపించారు.. అతని అరెస్టును ఖండిస్తూ వైసీపీ కార్యకర్తలు ఆందోళనలు చేశారు.. ట్విట్టర్ లో పోస్టులు పెట్టారు. అంతకు మించి భాస్కర్ రెడ్డికి ఒరిగిందేమీ లేదు! అంతకు మిమిచ్ దొరికేది కూడా ఏమీ ఉండే అవకాశం లేదు!! కారణం... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, పవన్, లోకేష్ లతో పాటు రాజకీయాలతో సంబంధం లేని నారా భువనేశ్వరిపైనా అతడు అసభ్యకరమైన పోస్టులు పెట్టారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి. దాన్ని నాడు అతడు "గొప్ప"గా భావించి ఉండొచ్చు! కానీ ఇప్పుడు పాపం పండిన పరిస్థితి!అలాగని భాస్కర్ రెడ్డికీ... చంద్రబాబు, లోకేష్, పవన్, భువనేశ్వరి వంటి వారితో ఎలాంటి వ్యక్తిగత శత్రుత్వమూ లేదు.. కనీసం వారిని అతడు ప్రత్యక్షంగా చూశాడో లేదో కూడా తెలియదు! కానీ.. తాను ఇష్టపడే పార్టీకి తానేదో మేలు చేస్తున్నాను అనే మైకంలో, తనను పార్టీ పెద్దలు గుర్తిస్తారనే ఆలోచనతోనో ఇలాంటి అసభ్యకరమైన పనికి పూనుకున్నాడు.

**అంతా ఆలోచించుకోవాల్సిన సమయం ఇది!:**

మొన్న ఓ ఎన్నారై, నేడు భాస్కర్ రెడ్డి, రేపు మరో వ్యక్తి.. ఎవరైనా కానీ, ఎక్కడ నుంచైనా కానీ... ఇలాంటి పనులకు పూనుకోవడం వల్ల ఎప్పటికైనా పాపం పండుతుందని, ఫలితం అనుభవించాల్సి వస్తుందని, ఫలితంగా జీవితం పాడవుతుందని గ్రహించుకోవాలి. ఇలాంటి పోస్టుల వల్ల.. తాను అభిమానించే నాయకుడికి ఒరిగేదీ ఉండదు.. తాను వ్యతిరేకించే నేతకు ఊడేదేమీ ఉండదు అన్న విషయాన్ని ఎప్పటికీ, ఎవరూ మరిచిపోకూడదు. ప్రధానంగా భాస్కర్ రెడ్డి అనుభవాన్ని సోషల్ మీడియా సైన్యం అని, సోషల్ మీడియా పులులమని, సిమ్హాలమని చెప్పుకుని చెలరేగిపోయే జనాలు.. స్వానుభవం వరకూ తెచ్చుకోకుండా జాగ్రత్తపడాలి. నచ్చిన పార్టీ ఉంటే ఓటు వేయాలి, పది మందిని ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభావితం చేసి ఓటు వేయించాలి. ఆ విషయం మరిచి.. ప్రత్యర్థులను దూషించడం వల్ల తన పార్టీకి ఏదో ప్రయోజనం కలుగుతుందని వారు భావిస్తే... నెక్స్ట్ భాస్కర్ రెడ్డిలు వారే అవుతారు... పార్టీ ఏదైనా, అధికారంలో ఎవరున్నా..!!

# కాశీబుగ్గ పండాతో ఎమ్మెల్సీ దువ్వాడకు లింకు! వెరీ ఇంట్రస్టింగ్ అప్డేట్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీవెంకటేశ్వర ఆలయ ధర్మకర్త హరి ముకుంద పండా, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కు మధ్య సంబంధాలు ఆసక్తికరంగా మారాయి. ఈ నెల 2వ తేదీన కార్తీక ఏకాదశి పర్వదినం సందర్భంగా కాశీబుగ్గలో హరి ముకుంద పండా నిర్మించిన ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మరణించారు. ఈ ఉదంతం తర్వాత హరి ముకుంద పండాపై ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలోనూ విపరీతమైన చర్చ జరిగింది. 95 ఏళ్ల హరి ముకుంద పండా కోట్లాది రూపాయలు సొంత డబ్బు వెచ్చించి 12 ఎకరాల విస్తీర్ణంలో ఆలయం నిర్మించిన వైనం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది.ఈ ఘటన తర్వాత వైసీపీ బహిష్కృత ఎమ్మెల్సీ దువ్వాడ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కాశీబుగ్గకు వచ్చారు. శ్రీకాకుళం జిల్లాకే చెందిన దువ్వాడ గత మూడు దశాబ్దాలుగా హరిశ్చంద్రపురం, టెక్కలి నియోజకవర్గాల నుంచి రాజకీయాలు చేస్తూ వచ్చారు. టీడీపీ ప్రధాన నేతలు కింజరాపు ఎర్రన్నాయుడు, అచ్చెన్నాయుడి రాజకీయ ప్రత్యర్థిగా పోరాడుతున్నారు. ఇక ఇటీవల కాలంలో ఆయన ప్రేమాయణం తీవ్ర వివాదాస్పదం కాగా, భార్యతో విభేదాలు రావడంతో తన మకాం హైదరాబాద్ కు మార్చారు. ఇక నిత్యం సోషల్ మీడియాలో రచ్చ రచ్చ చేస్తూ డిజిటల్ స్టార్ గా దువ్వాడ గుర్తింపు తెచ్చుకున్నారు.ఇదే సమయంలో ఆయన ప్రేయసి దివ్వెల మాధురి బిగ్ బాస్ సీజన్-9లో అందరినీ అలరించారు. దీంతో ఈ ఇద్దరు ఎటు వెళ్లినా సోషల్ మీడియాను అట్రాక్ట్ చేస్తున్నారు. ఇక కాశీబుగ్గ ప్రమాదం తర్వాత ఎమ్మెల్సీ దువ్వాడ తన ప్రేయసితో కలిసి హరి ముకుందా పండాను కలవడం ఆశ్చర్యానికి గురిచేసింది. కొద్ది రోజులుగా శ్రీకాకుళం జిల్లా వ్యవహారాలతో దూరంగా ఉన్న ఆయన సడన్ గా రావడం వెనుక ఆసక్తికర విశేషాలు ఉన్నాయని చెబుతున్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడ రాజకీయంగా టెక్కలిలో పనిచేసినప్పటికీ, ఆయన పుట్టి పెరిగింది మాత్రం కాశీబుగ్గలోనే.. ఆయన తల్లి, సోదరులు ఇక్కడే నివసిస్తుంటారు. ఆ విధంగా దువ్వాడ సొంత ఊరు కాశీబుగ్గగా చెబుతున్నారు. ఇక ఎమ్మెల్సీ తండ్రి దువ్వాడ కృష్ణమూర్తి, హరి ముకుంద పండాకు మంచి స్నేహితులు. అదేవిధంగా హరిముకుంద పండా కుమారుడు హెచ్.రాజకుమార్, ఎమ్మెల్సీ దువ్వాడ క్లాస్ మేట్స్. ఈ ఇద్దరు స్కూలింగ్ అంతా ఒకేచోట జరిగినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

కాశీబుగ్గ వచ్చిన దువ్వాడ ఆలయ ధర్మకర్త హరి ముకుంద పండా కోసం ఎవరూ చెప్పని విశేషాలు కూడా చెప్పారు. దాదాపు వంద కోట్ల ఆస్తులు ఉన్న హరి ముకుంద పండా శ్రీవిజయ వెంకటేశ్వరుడి పేరున 12 ఎకరాల భూములు రాశారని, అంతేకాకుండా భవిష్యత్తులో ఆలయ కైంకర్యాలకు ఎటువంటి లోటు రాకుండా రూ.6 కోట్లు డిపాజిట్ చేసినట్లు ఎమ్మెల్సీ దువ్వాడ వెల్లడించారు. అంతేకాకుండా హరి ముకుందా పండా తన సొంత డబ్బును ప్రతి నెలా వికలాంగులు, అనాథలకు పింఛన్లుగా పంచుతారని, అలా ప్రతినెలా రూ.3 లక్షలు ఖర్చుచేస్తారని కూడా చెప్పారు. ఇక తండ్రి బాటలోనే డాక్టర్ రాజ్ కుమార్ పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పుకొచ్చారు.పలాస-కాశీబుగ్గలో హరి ముకుంద పండా కుటుంబానికి గొప్ప చరిత్ర ఉందని ఎమ్మెల్సీ దువ్వాడ వివరించారు. వ్యక్తిగతంగా చాలా గొప్ప మనిషి అని కొనియాడు. అటువంటి వ్యక్తిని 95 ఏళ్ల వృద్ధుడిని తొక్కిసలాటకు కారకుడిగా ప్రభుత్వం చూపే ప్రయత్నాలు చేస్తుందని తనకు తెలిసిందని, దయచేసి అలాంటి ప్రయత్నం చేయొద్దని అభ్యర్థించారు దువ్వాడ. మానవ తప్పిదంగా కేసును నమోదు చేయాలని, ఈ ప్రాంతీయులకు హరి ముకుంద పండా సేవలు కొనసాగేలా చూడాలని దువ్వాడ కోరారు.

# ఒక్కొక్కరిది ఒక విజయగాథ... వరల్డ్ కప్ విజేతల ఇన్స్పిరేషనల్ లైఫ్ స్టోరీలు..

**యాభై ఏండ్ల కల ఇప్పటికి నెరవేరింది. ఇండియన్ విమెన్ క్రికెట్ టీం మొదటిసారి ప్రపంచ కప్ సాధించి చరిత్ర సృష్టించింది. విజయం కోసం టీం మెంబర్స్ అందరూ కష్టపడ్డారు. వరుసగా ఓడిపోయినా చివరికి ఫైనల్‌కు చేరి దక్షిణాఫ్రికాని ఓడించారు. గ్రౌండ్‌లో చూపించిన అదే ధైర్యం, తెగువ వాళ్ల నిజ జీవితాల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవడంలోనూ కనిపిస్తోంది. టీంలో చాలామంది చిన్న పట్టణాల నుంచి వచ్చినవాళ్లే. కలలను సాకారం చేసుకోవడానికి వాళ్లంతా ఎన్నో త్యాగాలు చేశారు. ఈ వారం వాళ్ల 'లైఫ్' స్టోరీలు వాళ్లవే.**




### నాన్న చేసిన బ్యాట్‌తో..

ఆల్ రౌండర్ అమన్ జోత్ కౌర్ పంజాబ్‌లో పుట్టి, పెరిగింది. ఆమె తండ్రి భూపిందర్ సింగ్ ఒక కార్పెంటర్ వర్క్‌షాప్‌లో పనిచేసేవాడు. అమన్ చిన్నప్పుడు ఒకసారి ఆమె దగ్గర బ్యాట్ లేదని అబ్బాయిలు తమతో ఆడనివ్వలేదు. భూపిందర్ దగ్గర బ్యాట్ కొనేందుకు డబ్బు లేదు. దాంతో వర్క్‌షాప్‌లో మిగిలి పోయిన చెక్కతో బ్యాట్ చేసి ఇచ్చాడు. అదే ఆమె పట్టుకున్న మొదటి బ్యాట్. అలా ఆమె 2023లో భారత జట్టులోకి అరంగేట్రం చేసింది.

### కిట్ కొనేందుకు డబ్బు లేక..

అవమానాలు, ఆర్థిక కష్టాలు, కుటుంబ త్యాగాల ఫలితమే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సాధించిన విజయం. ఆమె పంజాబ్‌లోని మొగాలో పుట్టింది. ఆమె తండ్రి హర్మందర్ సింగ్ భుల్లార్ క్లబ్ క్రికెటర్, జిల్లా కోర్టులో గుమస్తా. సరిపడా జీతం వచ్చేది కాదు. వాళ్లకు నాలుగు గేదెలు ఉండేవి. వాటి పాలు అమ్మి ఇంటి అవసరాలు తీర్చేవాడు. కూతుర్ని ఎలాగైనా గొప్ప క్రికెటర్‌ని చేయాలని కలలు కన్నాడు. కానీ.. ఆమె కోసం సరైన క్రికెట్ కిట్ కొనేందుకు కూడా డబ్బు లేదు. హర్మన్ బాయ్స్ షర్ట్ వేసుకుని క్రికెట్ ఆడేది. పాత బ్యాట్లు, సీమ్–లెస్ బంతులతో ప్రాక్టీస్ చేసేది. కూతుర్ని క్రికెట్ ఆడిస్తున్నందుకు చాలామంది భుల్లార్‌ను ఎగతాళి చేశారు. వాళ్ల మాటలను ఆయన ఎప్పుడూ పట్టించుకోలేదు. అందుకే ఫైనల్స్ గెలిచాక ట్రోఫీ పట్టుకుని "నాన్నా.. నీ కల నెరవేరింది" అన్నట్టు తండ్రి వైపు పరుగెత్తింది. ఆమెని అవమానించినవాళ్లకు ఆ ట్రోఫీతోనే సమాధానం చెప్పింది.

### హాకీ జట్టుకు కెప్టెన్

జెమిమా రోడ్రిగ్స్ ముంబైలోని బాంద్రాలో పుట్టింది. తండ్రి ఇవాన్ రోడ్రిగ్స్ జూనియర్ కోచ్‌గా పనిచేసేవాడు. అందుకే చిన్నప్పటినుంచే ఆమెను క్రికెట్ ఆడేలా ప్రోత్సహించాడు. ఆమె క్రికెట్‌తో పాటు హాకీ కూడా బాగా ఆడేది. మహారాష్ట్ర అండర్ – 17 హాకీ జట్టుకు కెప్టెన్ కూడా అయ్యింది. 2018లో ఇండియన్ క్రికెట్ టీంలో చేరింది. 2024లో ఖార్ జిమ్‌ఖానా క్లబ్?లో ఆమె తండ్రి ఇవాన్ మతపరమైన సమావేశాలు నిర్వహించి, క్లబ్ బైలాస్‌ని ఉల్లంఘించాడని ఆరోపణలు ఎదుర్కొన్నాడు. దాంతో ఖార్ జింఖానాలో జెమిమా గౌరవ సభ్యత్వాన్ని రద్దు చేశారు. దాంతో జెమిమా చాలా బాధపడింది. ఆ తర్వాత కూడా ఆమెని చాలామంది ట్రోల్ చేశారు. దాంతో కొన్నిసార్లు క్రికెట్‌ను వదిలేయాలి అనుకుంది. కానీ.. ఆస్ట్రేలియా మ్యాచ్‌లో 116 బంతుల్లో 14 బౌండరీలు, 3 సిక్సర్లతో 127 పరుగులు చేసి ఆమెని విమర్శించిన వాళ్లకు గట్టి సమాధానం ఇచ్చింది.

### తొమ్మిది ఏండ్లకే..

మహారాష్ట్రలోని సాంగ్లిలో క్రికెట్‌ను ఇష్టపడే కుటుంబంలో పుట్టింది స్మృతి మంధాన. వాళ్ల అన్న శ్రవణ్ కూడా క్రికెటర్. ఎన్నో అండర్%-%-16 టోర్నీలు ఆడాడు. స్మృతి తన తండ్రితో కలిసి అతని ఆటను చూసేందుకు వెళ్లేది. శ్రవణ్ విజయాలు సాధించినప్పుడు అతని గురించి స్థానిక పత్రికల్లో వార్తలు వచ్చేవి. అప్పుడే స్మృతికి కూడా ఆటపై ఆసక్తి పెరిగింది.

చిన్న వయసులోనే బ్యాట్ పట్టుకుంది. శ్రవణ్‌కు రాహుల్ ద్రవిడ్ సంతకం చేసి ఇచ్చిన బ్యాట్‌తో ప్రాక్టీస్ చేసింది. మహారాష్ట్ర అండర్%-%15 జట్టులో తొలిసారి ఎంపికైనప్పుడు ఆమె వయసు తొమ్మిది సంవత్సరాలు. 11 ఏండ్లకే మహారాష్ట్ర అండర్%-%19 టీంలో ఆడింది. ఆమెకు సైన్స్ చదవాలని కోరిక. కానీ.. సైన్స్ కోర్సుల్లో చేరితే క్రికెట్ ఆడేందుకు టైం దొరకదని కామర్స్‌లో చేరింది. ఆ తర్వాత 2013లో ఆమె భారత జట్టులోకి ఎంపికైంది.

### రోడ్లపైనే క్రికెట్..

రిచా ఘోష్ పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలో పుట్టింది. ఆమె తండ్రి మనబేంద్ర ఘోష్ క్లబ్ క్రికెటర్, కోచ్. రిచాకు చిన్నప్పటినుంచి టేబుల్ టెన్నిస్ అంటే ఇష్టం ఉండేది. కానీ.. తన తండ్రికి క్రికెట్‌మీద ఉన్న ఇష్టం వల్ల ఆమె కూడా క్రికెట్‌నే ఎంచుకుంది. క్రికెట్ స్టేడియం లేని ప్రాంతం వాళ్లది. రోడ్లపైనే క్రికెట్ ఆడేది.

పదేండ్ల వయసులోనే వికెట్ కీపర్?గా రాణించింది. వాళ్ల ప్రాంతంలో అమ్మాయిలు క్రికెట్ ఆడేవాళ్లు కాదు. అందుకే ఆమె అబ్బాయిలతోనే ఆడేది. మనబేంద్ర ఘోష్ ఆమెకు ట్రైనింగ్ ఇప్పించడానికి, కావాల్సినవి సమకూర్చడానికి తన ఆస్తులు కూడా అమ్మేశాడు.

### బంతి విసిరి..

దీప్తి శర్మది ఆగ్రాలోని అవధ్‌పురి కాలనీ. తన అన్న సుమిత్ క్రికెట్ ఆడేవాడు. అతనితోపాటు దీప్తి కూడా వెళ్లేది. ఒకసారి బంతి తన వైపు రావడంతో దాన్ని తీసుకుని విసిరింది. అది 50 మీటర్ల దూరంలో ఉన్న స్టంప్స్‌ని తాకింది. అక్కడే ఉన్న భారత మాజీ బ్యాటర్ హేమలత కాలా ఆమె టాలెంట్‌ని గుర్తించి, ప్రోత్సహించింది.

అప్పటినుంచి సుమిత్‌తో కలిసి దీప్తి కూడా క్రికెట్ ప్రాక్టీస్ చేసింది. ఆ తర్వాత సుమిత్ ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగంలో చేరాడు. దాంతో దీప్తిని రోజూ స్టేడియంకి తీసుకెళ్లేవాళ్లు లేక ప్రాక్టీస్ మానేసింది. కానీ.. ఆ తర్వాత చెల్లి కోసం సుమిత్ జాబ్ మానేసి రెండేళ్లపాటు రోజూ ప్రాక్టీస్‌కు తీసుకెళ్లాడు. అలా 2014లో ఇండియా క్రికెట్‌టీంలో చేరింది.

### అబ్బాయిలతో ఆడి..

ఫాస్ట్ బౌలర్ రేణుకా సింగ్ ఠాకూర్ సిమ్లాలోని పర్సా గ్రామంలో పుట్టింది. తండ్రి కేహర్ సింగ్ ఠాకూర్ ప్రభుత్వ ఉద్యోగి. ఆయనకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. రేణుకాకు మూడేండ్లు ఉన్నప్పుడు అతను చనిపోయాడు. దాంతో కుటుంబాన్ని పోషించడానికి తల్లి సునీత అతని ఉద్యోగంలో చేరింది. ఆదాయం అంతంత మాత్రంగానే వచ్చినా కూతురికి ఏ లోటు రానివ్వకుండా చూసుకుంది. తండ్రి లాగే రేణుకకు కూడా క్రికెట్ అంటే ఇష్టం. అందుకే తన అన్న వినోద్‌తో కలిసి క్రికెట్ ఆడేది.

ఆమెకు క్రికెట్‌మీదున్న ఇష్టాన్ని గమనించిన రేణుక మామ భూపిందర్ సింగ్ ఠాకూర్ ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే ఉమెన్స్ రెసిడెన్షియల్ అకాడమీలో ట్రయల్స్‌కు వెళ్లాలని సలహా ఇచ్చాడు. అక్కడే ఆమె తన ఆటను మెరుగుపరుచుకుంది. ఆ తర్వాత భారత జట్టులో చేరే అవకాశం వచ్చింది.

### జుట్టు కత్తిరించుకుని..

హర్యానాలోని రోహతక్‌లో పుట్టిన షఫాలీ వర్మ.. వాళ్ల ప్రాంతంలో క్రికెట్ ఆడే అమ్మాయిలు లేకపోవడంతో అబ్బాయిలతో ఆడాలి అనుకుంది. "గ్రౌండ్‌లో నా పేరు షఫాలీ అని చెప్పగానే 'ఇది అబ్బాయిలు ఆడే ఆట, వెళ్లి గుడియా ఆడుకో' అని ఎగతాళి చేసేవాళ్లు. అందుకే నా జుట్టును కత్తిరించుకుని, మా అన్నలా షార్ట్స్ వేసుకుని అతని స్థానంలో ఆడేదాన్ని" అని తాను ఎదుర్కొన్న సమస్యలను చెప్పింది షఫాలీ. ఆమె తండ్రి సంజీవ్ వర్మ రోహతక్‌లో బంగారం షాప్ నడిపేవాడు.

షఫాలీకి పదేండ్లు ఉన్నప్పుడు క్రికెట్ ప్రాక్టీస్?కి వెళ్లాలంటే రోజూ 40 కి.మీ. ప్రయాణించాల్సి వచ్చేది. దాంతో ఆమె కోసం సంజీవ్ తన దుకాణం మూసేసి ఆటో నడపడం మొదలుపెట్టాడు. ఆదాయం తగ్గి, ఇల్లు నడవడం కష్టమైంది. అయినా కూతురి కోసం ఆ కష్టాలన్నీ ఓర్చుకున్నాడు. హర్యానాలో 2014 వరకు అమ్మాయిల అండర్ %-%-14 జట్టు లేదు. దాంతో షఫాలీని బాయ్స్ అకాడమీలో చేర్చారు. 11 ఏండ్ల వయసులో ఆమె 15 ఏండ్ల అబ్బాయిలతో ఆడేది. అలా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఇండియా టీంలో స్థానం సంపాదించుకుంది.

### క్రికెట్ గేర్ అద్దెకు తెచ్చుకుని..

రాధా ప్రకాష్ యాదవ్ పశ్చిమ ముంబైలోని కందివలి వెస్ట్‌లో పుట్టింది. తల్లిదండ్రులు, ఇద్దరు అన్నలు, అక్కతో సహా మొత్తం తొమ్మిదిమంది ఒక చిన్న ఇరుకైన (225 స్క్వేర్ ఫీట్) ఇంట్లోనే ఉండేవాళ్లు. తండ్రి ఓంప్రకాష్ రోడ్డు మీద కూరగాయలు, పాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆమె క్రికెట్ ట్రైనింగ్ కోసం ఫీజు కట్టే స్తోమత కూడా లేదు.

దాంతో వాళ్ల గల్లీలోనే ప్రాక్టీస్ చేసేది. రాధ కంటే తన అక్క సోనీ మంచి ప్లేయర్. కానీ, వాళ్ల ఫ్యామిలీకి ఇద్దరిని క్రికెటర్లను చేసే స్తోమత లేకపోవడంతో తన కెరీర్‌ని త్యాగం చేసింది. రాధ కూడా మొదట్లో క్రికెట్ గేర్ అద్దెకు తెచ్చుకుని ప్రాక్టీస్ చేసేది.

### తల్లి నగలు అమ్మి..

మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలోని ఘువారాలోని ఒక గిరిజన కుటుంబంలో పుట్టింది క్రాంతి గౌడ్. తండ్రి మున్నా సింగ్ గౌడ్ కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోవడంతో కుటుంబానికి కష్టాలు మొదలయ్యాయి. దాంతో అన్నలు డైలీ వేజ్ లేబర్, బస్ కండక్టర్‌గా పని చేశారు. ఆమెకు చిన్నప్పటినుంచి క్రికెట్ అంటే ఇష్టం.

గల్లీలో చిన్నప్పుడు బంతి విసిరితే అబ్బాయిలు తిరిగి రాళ్లు రువ్వి హేళన చేశారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల 8వ తరగతితోనే చదువు మానేసింది. అప్పటినుంచి క్రికెట్‌పై ఫోకస్ పెట్టింది. ఒక దశలో క్రాంతి కలలను సాకారం చేసుకోవడానికి తన తల్లి నగలను కూడా అమ్మేసింది.

### ఏకైక ప్లేయర్

అస్సాంలోని కందులిమారి గ్రామంలో పుట్టింది ఉమా చెత్రీ. తండ్రి లోక్ బహదూర్ చెత్రీ చిన్న రైతు. ఉమా ఎంఎస్ ధోని అభిమాని. అందుకే ఆయనలాగే వికెట్ కీపర్? కావాలి అనుకుంది. 8 ఏండ్ల వయసులోనే తన అన్న విజయ్‌తో కలిసి క్రికెట్ ఆడేది. రోజూ 16 కి.మీ. సైకిల్ తొక్కుతూ బొకాఖాత్ ట్రైనింగ్ సెంటర్‌కి వెళ్లేది. "ఒకసారి మా ప్రాంతంలో వచ్చిన వరదలు నా షూని తీసుకెళ్లాయి. కానీ, నా కలల్ని తీసుకెళ్లలేకపోయాయి" అంటుంది ఉమా. షూ లేకున్నా క్రికెట్ ప్రాక్టీస్ చేసి భారత జట్టులో స్థానం సంపాదించింది. 2025 మహిళల ప్రపంచ కప్ జట్టులో ఈశాన్య భారతదేశం నుంచి పాల్గొన్న ఏకైక ప్లేయర్ ఆమెనే.

### ప్లాస్టిక్ బ్యాట్‌తో ప్రాక్టీస్

కడప జిల్లా ఎర్రమల్లెపల్లి గ్రామానికి చెందిన శ్రీచరణి మూడో తరగతిలో ఉన్నప్పుడు క్రికెట్ ఆడడం మొదలుపెట్టింది. తండ్రి చంద్రశేఖర్ రెడ్డి రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగి. మామ కిషోర్ కుమార్ రెడ్డి పార్ట్–టైమ్ క్రికెటర్. అతనే శ్రీ చరణికి క్రికెట్‌ని పరిచయం చేశాడు. మామతో కలిసి ఇంట్లో ప్లాస్టిక్ బ్యాట్‌లతో ఆడుకునేది.

ఆ తర్వాత అతనితో పాటు క్వార్టర్స్‌లోని గ్రౌండ్‌కి వెళ్లడం మొదలుపెట్టింది. తన కంటే ఎక్కువ వయస్సు ఉన్న ఆటగాళ్లతో పోటీ పడేది. అలా భారత జట్టులో చేరి వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. మొత్తం తొమ్మిది మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసింది. టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించింది.

# 'రాజా సాబ్'.. సౌండ్ ఎక్కడ?





ఎస్ఎస్. థమన్.. ఈ పేరు ఇప్పుడు సౌత్ ఇండియాలో ఒక బ్రాండ్. సినిమా రిలీజ్‌కు ఆరు నెలల ముందే ఆల్బమ్‌తో హడావిడి మొదలుపెట్టడం, ప్రతీ పాటను ఒక ఈవెంట్‌లా ప్రమోట్ చేయడం ఆయన స్టైల్. 'అల వైకుంఠపురములో' నుంచి రీసెంట్ బ్లాక్‌బస్టర్ల వరకు, మ్యూజికల్‌గా సినిమాకు ఫుల్ హైప్ తేవడంలో థమన్ కింగ్. కానీ, అలాంటి థమన్.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విషయంలో మాత్రం సైలెంట్ అయిపోయాడు. ప్రభాస్ నటిస్తున్న 'రాజా సాబ్' సినిమా సంక్రాంతికి వస్తుందని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. అంటే, సినిమా రిలీజ్‌కు కరెక్ట్‌గా రెండు నెలలు మాత్రమే టైమ్ ఉంది. ఇది ప్రభాస్ నుంచి వస్తున్న ఫుల్ ఎంటర్‌టైనర్. డైరెక్టర్ మారుతి. ఇలాంటి కాంబోకు, ముఖ్యంగా సంక్రాంతి లాంటి పెద్ద ఫెస్టివల్‌కు మ్యూజిక్ ఎంత ప్లస్ అవ్వాలో, ఆ సాంగ్స్ జనాల్లోకి ఎంతలా వెళ్లాలో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కానీ, 'రాజా సాబ్' టీమ్ నుంచి ఆ సౌండే రావడం లేదు. ఇప్పటికే మేకర్స్ ఒక టీజర్, రీసెంట్‌గా ఒక ట్రైలర్‌ను కూడా వదిలారు. అవి ఫర్వాలేదనిపించాయి. కానీ, ఒక సినిమాకు అసలు బలం మ్యూజిక్. ఆ మ్యూజికల్ ప్రమోషన్లే ఇంకా స్టార్ట్ కాలేదు. కనీసం ఫస్ట్ సింగిల్ ఎప్పుడు వస్తుందో కూడా క్లారిటీ లేదు. థమన్ లాంటి సుప్రీమ్ టాలెంట్ ఉన్న కంపోజర్ చేతిలో ఉండి కూడా, ఈ సైలెన్స్ ఏంటని ఫ్యాన్స్ కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. చిన్న హీరోల సినిమాలకు కూడా నెలల ముందే సాంగ్ లోడింగ్ అంటూ ట్వీట్లు వేసే థమన్, ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ విషయంలో ఇంత సైలెంట్‌గా ఉండటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇది 'రాజా సాబ్' లాంటి భారీ స్కేల్ సినిమాకు అస్సలు మంచిది కాదు. అయితే ఒకేసారి స్టార్ట్ చేయాలని నిర్మాతల నుంచి ఏమైనా కండీషన్స్ వస్తున్నాయా అనేది తెలియాల్సి ఉంది. ఏదేమైనా రిలీజ్‌కు రెండు నెలల టైమ్ పెట్టుకుని, ఇంకా ఫస్ట్ సింగిల్‌ను కూడా వదలకపోవడంతో ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. అసలు ఆల్బమ్ రెడీ అయిందా, లేదా? లేక ఇది ఏదైనా కొత్త రకం ప్రమోషనల్ స్ట్రాటజీనా? అనేది అర్థం కావట్లేదు. ప్రభాస్ లాంటి బ్యాంకబుల్ సూపర్ స్టార్ సినిమాకే మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయడానికి ఇంత కష్టపడటం ఏంటని ఇండస్ట్రీ వర్గాలు కూడా షాక్ అవుతున్నాయి. సంక్రాంతి రేసులో నిలవాలంటే, ఈపాటికే కనీసం రెండు మూడు చార్ట్‌బస్టర్లు జనాల ప్లే లిస్టుల్లో మోగిపోవాలి. కానీ, 'రాజా సాబ్' ఆల్బమ్ నుంచి జీరో సౌండ్ ఉంది. థమన్ ఇప్పటికైనా మేల్కొని, తన మార్క్ ప్రమోషన్లతో ఆల్బమ్‌ను జనాల్లోకి తీసుకెళ్లకపోతే.. ఈ సైలెన్స్ సినిమాపై నెగటివ్ ఇంపాక్ట్ చూపించే ప్రమాదం ఉంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com